**ప్రజలకు / పారకులకు ముఖ్య విజ్ఞప్తి**

"ప్రజాప్రశ్న" దినపత్రిక పేరు చెప్పుకొని ఎవరైనా డబ్బులు, విరాళాలు, ప్రకటనల పేరుతో నగదు లేదా ఇతర రూపంలో డిమాండ్ చేస్తే **దయచేసి నమ్మవద్దు.**

అలాంటి వ్యక్తుల వివరాలను వెంటనే మా దృష్టికి తీసుకురండి. ప్రజల ఫిర్యాదు అందిన వెంటనే సంబంధిత వ్యక్తులపై పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

- ప్రజాప్రశ్న యాజమాన్యం

PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267


తెలుగు దినపత్రిక

సంపుటి: 6 సంచిక: 74, పేజీలు - 08

శుక్రవారం, సెప్టెంబర్ 11, 2026 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD



## రేసులో మళ్లీ వెనుకబడిపోతున్న బీజేపీ!

**- తెలంగాణ రాజకీయాల్లో కాంగ్రెస్ వర్సెస్ బీఆర్ఎస్**

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలో మూడు రోజులుగా జరుగుతున్న పరిణామాలన్నీ కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య యుద్ధాన్ని సూచిస్తున్నాయి. బీజేపీ ఎక్కడా కనిపించడం లేదు. పార్లమెంట్ ఎన్నికల నాటికి తెలంగాణలో బీఆర్ఎస్ ఓటు బ్యాంక్ దాదాపు 16-18 శాతానికి పడిపోవడం, కాంగ్రెస్ - బీజేపీ చెరో 8 స్థానాలు గెలుచుకోవడంతో రాష్ట్రంలో కాంగ్రెస్‌కు ప్రధాన ప్రత్యామ్నాయం తామేనని కమలనాథులు భావించారు. కానీ, గత కొన్ని రోజులుగా అసెంబ్లీ లోపల, బయట చోటుచేసుకున్న హైవోల్టేజ్ పరిణామాలను గమనిస్తే.. తెలంగాణ రాజకీయం మళ్లీ పాత రోజుల్లా కాంగ్రెస్ వర్సెస్ బీఆర్ఎస్ గానే మారిపోయింది.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వేస్తున్న రాజకీయ వ్యూహాలు, బీఆర్ఎస్ శ్రేణుల నిరసనలు, అరెస్టులు, కేసీఆర్ ఫామ్‌హౌస్‌పై దర్యాప్తులు మొత్తం పొలిటికల్ స్పేస్‌ను ఆక్రమించేశాయి. ఈ హోరాహోరీ పోరు మధ్య బీజేపీ తీవ్రంగా వెనుకబడి, రేసులో లేనట్లే కనిపించడం రాజకీయ వర్గాల్లో పెద్ద చర్చకు దారితీస్తోంది.

### దూకుడుగా బీఆర్ఎస్

పార్లమెంట్ ఎన్నికల ఫలితాలు జాతీయ అంశాల ప్రాతిపదికన వచ్చినవి తప్ప, స్థానిక రాజకీయాల్లో బీజేపీ బలం పెరిగినట్లు కాదని ఈ పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి. తెలంగాణలో క్షేత్రస్థాయి యంత్రాంగం, నిలకడైన కేడర్ ఇప్పటికీ బీఆర్ఎస్ వద్దే ఉంది.

శాసనసభ వేదికగా ప్రతిపక్ష పాత్ర పోషించడంలో కేటీఆర్, హరీశ్‌రావు నాయకత్వంలోని గులాబీ దళం దూకుడుగా ముందుకెళ్తోంది. అదే సమయంలో, ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టడానికి కాంగ్రెస్‌తో నేరుగా తలపడుతున్నది కూడా బీఆర్ఎస్ మాత్రమే. దీంతో సహజంగానే మీడియా ఫ్రేమ్‌లో, పజల చర్చల్లో బిఆర్ఎస్ ప్రధాన ప్రతిపక్షంగా నిలుస్తోంది.

### బీజేపీని రేసులోకి రానివ్వని కాంగ్రెస్

మరోవైపు, కాంగ్రెస్ ప్రభుత్వం కూడా తెలివిగా బీజేపీని రేసులోకి రానివ్వకుండా వ్యూహాత్మకంగా వ్యవహరిస్తోంది. రేవంత్ రెడ్డి టార్గెట్ ఎప్పుడూ కేసీఆర్ మరియు బీఆర్ఎస్ నాయకత్వమే. బీఆర్ఎస్ హయాంలో జరిగిన అక్రమాలు, శాసనసభలో దళిత స్పీకర్ అవమాన ఉదంతం, ఎర్రవల్లి ఫామ్‌హౌస్ కుట్రలంటూ చర్చ అంతా తమకూ-బీఆర్ఎస్‌కూ మధ్యే పరిమితమయ్యేలా కాంగ్రెస్ నెరేటివ్‌ను సెట్ చేయగలిగింది. కాంగ్రెస్ వ్యూహంలో కేసీఆర్ విలన్‌గా, రేవంత్ నాయకుడిగా కనిపిస్తున్నప్పుడు, మూడో పక్షంగా ఉన్న బీజేపీకి ఎలాంటి పొలిటికల్ స్పేస్ లేదా ప్రాధాన్యత దక్కడం లేదు. ఈ రచ్చ అంతటిలోనూ బీజేపీ సొంతంగా ఒక బలమైన నెరేటివ్‌ను తయారు చేసుకోవడంలో ఘోరంగా విఫలమవుతోంది.

### బీజేపీ నాయకత్వం వైఫల్యం

ఢిల్లీ నాయకత్వం, లోక్‌సభ విజయాలను మాత్రమే నమ్ముకుంటే స్థానిక రాజకీయాల్లో మనుగడ కష్టమని కమలనాథులు గ్రహించలేకపోతున్నారు. అసెంబ్లీలో ప్రజా సమస్యలపై మాట్లాడేందుకు బీజేపీకి లభించే అవకాశం చాలా పరిమితంగా ఉండటంతో పాటు,

2లో..

### తమిళనాడు రాజకీయాల్లో

## 'దవడ సైగ' మంటలు

**- సీఎం విజయ్ వర్సెస్ ఎంకే స్టాలిన్!**



**చెన్నై (ప్రశ్న న్యూస్)** గతాన్ని వదిలేస్తే.. ఈ మధ్య కాలంలో నిన్న మొన్నటివరకూ ఆదర్శంగా కనిపించిన తమిళనాడు రాజకీయాల్లో తాజాగా వ్యక్తిగత దూషణలు, విమర్శలు ఎక్కువయ్యాయి. ముఖ్యంగా సీఎం విజయ్ ఎందుకో కానీ తన రాజకీయ ప్రత్యర్థుల్ని శత్రువుల్లా చూస్తున్నారు. వారిపై వ్యక్తిగత విమర్శలు ఎక్కుపెడుతున్నారు. అంతే కాదు వారిని తన హావభావాలతో అనుకరిస్తూ అసెంబ్లీలోనే హేళన చేస్తున్నారు. దీనిపై సొంత కూటమిలోనే విమర్శలు వ్యక్తమవుతున్నా పట్టించుకోవడం లేదు. ఇదే క్రమంలో తాజాగా మాజీ సీఎం ఎంకే స్టాలిన్ ను ఉద్దేశించి విజయ్ ప్రదర్శించిన హావభావాలు విమర్శల పాలయ్యాయి. వీటిపై స్టాలిన్ స్పందించారు.

2లో..

### అసెంబ్లీ ఘటనపై

## సర్కార్ ఫ్లాష్ సర్వే

**- బీఆర్ఎస్ తీరును ప్రజలు తప్పుపట్టారన్న సీఎం రేవంత్**

- ఎమ్మెల్యేలకు సీఎం రేవంత్ దిశానిర్దేశం - అసెంబ్లీ కార్యకలాపాలను బీఆర్ఎస్ అడ్డుకుంటోందని ఆరోపణ
- అధికారం కోల్పోయినా బీఆర్ఎస్ అహంకారం వీడలేదని వ్యాఖ్య
- ప్రతిపక్షాల కుట్రలను సమర్థంగా ఎదుర్కోవాలని ఎమ్మెల్యేలకు పిలుపు
- ప్రభుత్వ విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచన

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ అసెంబ్లీ వేదికగా అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య రాజకీయ వివాదం మరింత వేడెక్కింది. అసెంబ్లీ కమిటీ హాల్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కాంగ్రెస్ శాసనసభా పక్ష

2లో..



### బ్రిక్స్ సదస్సు సర్వం సిద్ధం

**- హాజరుకానున్న రష్యా, చైనా అధ్యక్షులు పుతిన్, జిన్‌పింగ్**




న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) ఈ వారాంతంలో జరగనున్న ప్రతిష్మాత్మక బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సుకు దేశ రాజధాని న్యూఢిల్లీ సర్వ సన్నద్ధమైంది. ఈ కీలక కార్యక్రమానికి భారత్ సిద్ధంగా ఉందని,

2లో..

## ఫైళ్లు పెండింగ్‌లో ఉంటే, అభివృద్ధి పెండింగ్‌లో ఉన్నట్టే

**- కలెక్టర్ల సదస్సులో అధికారులకు సీఎం దిశానిర్దేశం**

**అమరావతి (ప్రశ్న న్యూస్)** రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇల్లు లేదా ఇంటి పట్టాలు అందేలా చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. ఇళ్ల పట్టాల పంపిణీ, గృహ నిర్మాణాలపై పరిమిత సమయం పెట్టుకుని పనిచేయాలని స్పష్టం చేశారు. ఇళ్ల పట్టాలు, గృహ నిర్మాణాలకు సంబంధించి 10 రోజుల్లో సమగ్ర కార్యాచరణ ప్రణాళికతో రావాలని సంబంధిత అధికారులను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. 8వ జిల్లా కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో గృహ నిర్మాణం, పేదల ఇళ్ల పట్టాలు, ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణపై చర్చించారు. ప్రస్తుతం 1.43 లక్షల మందిని ఇళ్ల పట్టాలకు అర్హులుగా గుర్తించినట్లు అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. మరో 1.26 లక్షల దరఖాస్తులను పరిశీలిస్తున్నామని, వచ్చే నెల 15వ తేదీ నాటికి వాటి పరిశీలన పూర్తి చేస్తామని తెలిపారు.

2లో..



## మెగా డీఎస్సీ కాదు.. దగా డీఎస్సీ

**- జగన్‌మోహన్ రెడ్డి సంచలన ఆరోపణలు!**



అమరావతి (ప్రశ్న న్యూస్) కూటమి ప్రభుత్వం చేపట్టిన మెగా డీఎస్సీ-2025 నిరుద్యోగులను, నిజాయితీపరులైన అభ్యర్థులను ఘోరంగా దగా చేసిన అతిపెద్ద కుంభకోణమని వైఎస్ఆర్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆరోపించారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. డీఎస్సీ స్కామ్‌కు సంబంధించిన నివ్వెరపోయే వాస్తవాలు, పక్కా సాక్ష్యాలను తవ్వేకొద్దీ బయటపడుతున్నాయని, అందుకే ప్రశ్నించిన వారిపై కేసులు పెడుతూ, జర్నలిస్టుల నోళ్లు నొక్కుతూ, సోషల్ మీడియా ఖాతాలను బ్లాక్ చేస్తూ చంద్రబాబు ప్రభుత్వం రక్తాశ్రితమైన ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తోందని మండిపడ్డారు. ఈ డీఎస్సీ స్కామ్‌కు మూలకారణం పారదర్శకతకు పాతిపెట్టడమేనని జగన్ విమర్శించారు. రాష్ట్ర చరిత్రలోనే ఎన్నడూ లేనివిధంగా ప్రశ్నాపత్రాల తయారీ, పరీక్షల నిర్వహణ, పర్యవేక్షణ బాధ్యతలన్నింటినీ ఒకే ఒక్క వ్యక్తి చేతిలో ఎందుకు పెట్టారని నిలదీశారు. ఎస్సీఈఆర్టీలో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగిగా చేసిన వ్యక్తికి ఫస్ట్ ర్యాంక్ ఎలా వచ్చిందో, ఆ తర్వాత అతని ఐడీని బ్లాక్ చేసి మెరిట్ లిస్టులను ఎందుకు మార్చారో ప్రభుత్వం సమాధానం

2లో..

## సర్కార్ భూములపై అనుముల గద్దలు!

**- ఫ్యూచర్ సిటీలో భూపోరు, రేవంత్ ఫ్యామిలీనే టార్గెట్**




**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ శాసనసభ నుంచి సస్పెన్షన్ గురైన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఏమాత్రం తగ్గకుండా కాంగ్రెస్ ప్రభుత్వంపై తమ పోరాటాన్ని వీధుల్లోకి తీసుకెళ్లారు. కాంగ్రెస్ ప్రతిష్మాత్మకంగా ప్రచారం చేసుకుంటున్న ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టు కేటాయింపుల్లో సీఎం రేవంత్ రెడ్డి కుటుంబ సభ్యులకు లబ్ధి చేకూరేలా భారీ భూకేటాయింపులు చేశారని, భూదోపిడీ జరిగిందని ఆరోపిస్తూ రంగారెడ్డి జిల్లాలోని తుక్కుగూడ, రావిర్యాల ప్రాంతాలలో బీఆర్ఎస్ అగ్రనేతలు గులాబీ దళంతో కలిసి మెరుపు పర్యటన చేపట్టారు. ఇది తెలంగాణ రాజకీయాల్లో ఒక్కసారిగా పొలిటికల్ హీట్‌ను గరిష్ఠ స్థాయికి తీసుకెళ్లింది.

3లో..

## బీఆర్ఎస్ ఎమ్మెల్సీల బెయిల్ రద్దు చేయాలని కోర్టులో పిటిషన్

**- షరతులు ఉల్లంఘించారన్న పోలీసులు**



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసినట్లు నమోదైన కేసులో తీవ్ర రాజకీయ, న్యాయపరమైన ఉత్కంఠ నెలకొంది. బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ రెడ్డిలకు సంబంధించి నమోదైన ఈ వ్యవహారంలో సైఫాబాద్ పోలీసులు నాంపల్లి కోర్టును ఆశ్రయించారు. ఇద్దరు ఎమ్మెల్సీలకు గతంలో మంజూరైన బెయిల్‌ను రద్దు చేయాలని విజ్ఞప్తి చేస్తూ పోలీసులు కోర్టులో అత్యవసర పిటిషన్ దాఖలు చేశారు. న్యాయస్థానం విధించిన షరతులను, నిబంధనలను ఆ ఇద్దరు నేతలు ఉల్లంఘించారని పోలీసులు తమ పిటిషన్‌లో ప్రధానంగా ఆరోపించారు.

2లో..

## ఉద్యోగులకు రూ.కోటి బీమా

**- తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. దేశంలోనే తొలిసారి ఉద్యోగులకు రూ.కోటి బీమా ప్రకటించింది. ఇప్పటి వరకు దేశంలో ఏ ప్రభుత్వం అమలు చేయని విధంగా ఉద్యోగులకు ఈ బీమా కల్పిస్తోంది. ప్రభుత్వ ఉద్యోగులు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది, పెన్షనర్లకు ఈ బీమా అందిస్తుంది. ఈ విషయాన్ని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క శాసనసభలో ప్రకటించారు. ఉద్యోగి దురదృష్టవశాత్తూ మరణించినా అతడి కుటుంబం ఆర్థికంగా రోడ్డున పడకుండా భద్రత కల్పించాలనే మానవీయ ఉద్దేశంతో ఈ పథకాన్ని అమలు చేస్తున్నట్లు ఆయన చెప్పారు. ప్రభుత్వంపై, ఉద్యోగులపై ఎలాంటి ఆర్థిక భారం లేకుండా బ్యాంకుల సహకారంతో పథకాన్ని అమలు చేస్తున్నట్లు ఆయన సభకు చెప్పారు. గురువారం నాడు శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో ప్రభుత్వ ఉద్యోగులకు ప్రమాద బీమా, హెల్త్ కార్డుల గురించి సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వివరణాత్మకంగా చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం 16 బ్యాంకులతో ఒప్పందం చేసుకుని రెగ్యులర్ ఉద్యోగులు, పెన్షనర్లు, కాంట్రాక్ట్,

2లో..

## నిమజ్జనానికి హైడ్రా వ్యతిరేకం కాదు

- గణేశ్ నిమజ్జనాలపై హైడ్రా చీఫ్ రంగనాథ్ ప్రకటన
- సున్నితమైన చెరువుల వద్ద మాత్రమే ఆంక్షలు అమలు
- అన్ని చెరువులు, జలాశయాల్లో నిమజ్జనాలు యథావిధిగా సాగుతాయని స్పష్టం



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** హైదరాబాద్ నగరంలో గణేష్ విగ్రహాల నిమజ్జనాలపై హైడ్రా అధికారులు ఆంక్షలు విధించిందంటూ నెట్టింట జరుగుతున్న ప్రచారంపై హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ క్లారిటీ ఇచ్చారు. నగరంలో ఉన్న చెరువుల్లో వినాయక విగ్రహాల నిమజ్జనానికి హైడ్రా వ్యతిరేకం కాదని ఆయన తేల్చి చెప్పారు. పర్యావరణ పరిరక్షణ నిబంధనల కారణంగా కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా గుర్తించిన కేవలం నాలుగైదు చెరువుల్లో మాత్రమే కొన్ని ఆంక్షలు ఉన్నాయని వెల్లడించారు. గణేష్ నిమజ్జనాలను హైడ్రా అడ్డుకుంటోందంటూ సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారం వాస్తవం కాదని హైడ్రా రంగనాథ్ తెలిపారు. భక్తులు ఎలాంటి అసత్య ప్రచారాలను నమ్మవద్దని హితవు పలికారు. చెరువుల పరిరక్షణతో పాటు గణేష్ ఉత్సవాలు సజావుగా జరిగేలా హైడ్రా అధికారులు సహకరిస్తారని చెప్పారు.

తాను కూడా హిందువునేనని చెప్పిన హైడ్రా కమిషనర్ తనకు దైవభక్తి ఉందని వెల్లడించారు. గణేష్ నిమజ్జనాల విషయంలో హైడ్రా ఎక్కడా భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా వ్యవహరించదని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం

3లో..

# రేసులో మళ్లీ వెనుకబడిపోతున్న బీజేపీ!

వీధుల్లో కాంగ్రెస్‌ను ఢీకొట్టే ఆందోళన కార్యక్రమాలను సృష్టించడంలో పార్టీ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోంది. దీంతో బీజేపీ ఇచ్చే నిరసన ప్రకటనలు బీఆర్ఎస్–కాంగ్రెస్ దాడుల ముందు కొట్టుకుపోతున్నాయి. పార్లమెంట్ ఎన్నికల తదుపరి మైలేజ్‌ను నిలబెట్టుకోవడంలో బీజేపీ వైఫల్యం స్పష్టంగా కనిపిస్తోంది. తెలంగాణ ప్రజల్లో కాంగ్రెస్‌ను ఢీకొట్టగల ఏకైక శక్తి బీఆర్ఎస్ మాత్రమే అనే నమ్మకం మళ్లీ బలపడితే, బీజేపీ సాధించిన 8 లోక్‌సభ సీట్ల విజయం ఒక తాత్కాలిక బబుల్‌గా మిగిలిపోయే ప్రమాదం ఉంది. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల నాటికి బీజేపీ ఇదే రకమైన సైలెంట్ రోల్ పోషిస్తే రాష్ట్రంలో మళ్లీ కాంగ్రెస్–బీఆర్ఎస్ ద్విముఖ పోరే కంటిన్యూ అవ్వడం ఖాయం.

# తమిళనాడు రాజకీయాల్లో 'దవడ సైగ' మంటలు

గతంలో తనను జైల్లో వేసి కొట్టడం, దవడ పగలడాన్ని ఉద్దేశించి అసెంబ్లీలో ప్రస్తావిస్తూ సీఎం విజయ్ ప్రదర్శించిన హావభావాలపై స్టాలిన్ గురువారం వీడియో రిలీజ్ చేశారు. ఇందులో ఆయన అవును తమ్ముడూ నన్ను ఎమర్జెన్సీ కాలంలో జైల్లో వేసి దవడ పగిలేలా కొట్టారని స్టాలిన్ గుర్తుచేసుకున్నారు. 1975–77 మధ్య ఎమర్జెన్సీ సమయంలో తమిళనాడులో కరుణానిధి ప్రభుత్వాన్ని రద్దయిన సమయంలో డీఎంకే యువజన నాయకుడిగా ఉన్న తనను జైల్లో వేసి హింసించిన విషయాన్ని స్టాలిన్ గుర్తుచేసారు. అప్పటి దాడిలో తన దవడలు విరిగిపోయాయని, తనకు తగిలిన దెబ్బలు ఈ నాటికీ ఉన్నాయన్నారు. ఇందులో దాచేదేమీ లేదన్నారు. ప్రజా జీవితంలో ఉన్న వారికి, ముఖ్యంగా తమిళనాడు ప్రయోజనాల కోసం పోరాడిన వారికి ఇలాంటి అణచివేత ఎదురైందని స్టాలిన్ తెలిపారు. పోరాటాలు తమకు కొత్తేమీ కాదన్నారు. మీరు స్ఫూర్తిగా చెప్పుకునే అన్నాదురై కాలం చరిత్ర ఇది అన్నారు. డీఎంకే చరిత్రలో భాగమైనందుకు తనకు గర్వంగానే ఉందన్నారు. తన పోరాటం, జీవితం గురించి తెలుసుకోవాలంటూ విజయ్ కు స్టాలిన్ చురకలు అంటించారు. మీకు నిజాలు తెలియవు అంటూ స్టాలిన్ విజయ్ ను ఉద్దేశించి ఈ వీడియోలో వ్యాఖ్యానించారు. విజయ్ అసెంబ్లీలో స్టాలిన్ ను ఉద్దేశించి చేసిన సైగను బాడీ షేమింగ్ అంటూ రాష్ట్రంలో పలు రాజకీయ పార్టీలు విమర్శించిన నేపథ్యంలో ఈ వీడియో రిలీజ్ అయింది.

# ఫైళ్లు పెండింగ్‌లో ఉంటే,అభివృద్ధి పెండింగ్‌లో ఉన్నట్టే

### 18వేల మందికి ఇళ్ల పట్టాలు

రాష్ట్రంలోని 1,692 గ్రామాల్లో 18 వేల మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చేందుకు అవసరమైన భూమిని గుర్తించినట్లు అధికారులు సీఎం చంద్రబాబు నాయుడుకు తెలియజేశారు. ఇళ్ల పట్టాల పంపిణీ ప్రక్రియను ఏడాదిలోపు పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు. ఎంతమందికి కొత్తగా ఇళ్ల పట్టాలు ఇవ్వాలి.. ఎంతమందికి పట్టాలను క్రమబద్ధీకరించాలనే అంశాలపై స్పష్టమైన జాబితాను సిద్ధం చేయాలని సూచించారు. రాష్ట్రంలో గృహ నిర్మాణాల పురోగతిపైనా ముఖ్యమంత్రి సమీక్షించారు. ఇప్పటివరకు 5.92 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తయిందని అధికారులు తెలిపారు. మరో 5.32 లక్షల ఇళ్లు వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయని వివరించారు. నిర్మాణంలో ఉన్న ఇళ్లన్నింటినీ వచ్చే ఏడాది మార్చి నాటికి పూర్తి చేసి లబ్ధిదారులకు అందుబాటులోకి తీసుకురావాలని సీఎం ఆదేశించారు. ప్రతి ఒక్కరికీ ఇల్లు లేదా ఇళ్ల పట్టా అందేలా చూడాలని స్పష్టం చేశారు. ఈ ప్రక్రియలో జాప్యానికి తావులేకుండా నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి చేయాలని సూచించారు. ఇళ్ల పట్టాల పంపిణీ, గృహ నిర్మాణాలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. జిల్లా ఇంఛార్జ్ మంత్రులు ప్రత్యేక చొరవ తీసుకుని జిల్లా యంత్రాంగంతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. అర్హుల గుర్తింపు నుంచి పట్టాల పంపిణీ, గృహ నిర్మాణాల పూర్తి వరకు ప్రతి దశను నిర్దేశిత కాలపరిమితిలో పూర్తి చేసేలా పర్యవేక్షించాలని ఆదేశించారు.

### సీసీఎల్ఏలో స్ట్రక్చర్డ్ ల్యాండ్ బ్యాంక్ పోర్టల్

రాష్ట్రవ్యాప్తంగా అందుబాటులో ఉన్న భూములకు సంబంధించి స్ట్రక్చర్డ్ ల్యాండ్ బ్యాంక్ పోర్టల్‌ను తయారు చేయాలని రెవెన్యూ శాఖను ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. 8వ జిల్లా కలెక్టర్ల కాన్ఫరెన్సులో యాక్షన్ టేకెన్ రిపోర్టులపై చర్చ సందర్భంగా వేర్వేరు అంశాలపై దిశానిర్దేశం చేశారు. ఏళ్ల తరబడి నిరుపయోగంగా ఉండిపోతున్న భూముల్ని గుర్తించి వాటి వివరాలను పోర్టల్‌లో నమోదు చేయాలని సీఎం స్పష్టం చేశారు. రీసర్వే పూర్తయ్యాక ప్రభుత్వ భూములపై పూర్తి స్పష్టత వస్తుందని సీఎం అన్నారు. వివిధ ప్రభుత్వ శాఖల వద్ద ఏళ్లుగా వినియోగం లేని భూముల్ని గుర్తించాలన్నారు. వాటి వివరాలను కామన్ ల్యాండ్ బ్యాంక్ పోర్టల్ కిందకు తీసుకు రావాలన్నారు. జిల్లాలు, శాఖల వారీగా ప్రభుత్వ భూముల వివరాలను నమోదు చేయాలని సీఎం దిశానిర్దేశం చేశారు. ఏ ప్రభుత్వ శాఖకు భూమి అవసరమైనా ఈ పోర్టల్ ద్వారా కేటాయించే పరిస్థితి ఉండాలని అన్నారు. భూమి కొరత అభివృద్ధికి అడ్డంకి కాకూడదని సీఎం స్పష్టం చేశారు. ప్రాజెక్టు మంజూరు అయిన తర్వాత భూమి కోసం వెతకకుండా ముందుగానే పారిశ్రామిక, అభివృద్ధి ప్రాజెక్టులకు అవసరమైన భూమిని గుర్తించాలని సీఎం చంద్రబాబు నాయుడు సూచించారు.

### మూడు నెలల కార్యాచరణ ముందుగానే

ప్రతి ప్రభుత్వ శాఖ, జిల్లా కలెక్టర్ స్పష్టమైన యాక్షన్ క్యాలెండర్ ను రూపొందించుకుని నిర్దేశిత గడువులోగా ఫలితాలను సాధించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. కలెక్టర్లు కేవలం చర్యలకు మాత్రమే పరిమితం కాకుండా ఫలితాలను సాధించేలా ఉండాలన్నారు. జిల్లా అధికారులూ కలెక్టర్లు అన్ని శాఖల అభివృద్ధి కార్యక్రమాలపై 360 డిగ్రీల కోణంలో దృష్టి సారించాలని అన్నారు. శాఖల మధ్య ప్రభావిత అయ్యే పనుల్ని కలెక్టర్ పరిష్కరించాలన్నారు. సమస్యల్ని ప్రస్తావించటం ఒక్కటే కాకుండా పరిష్కారం చూపేలా కలెక్టర్లు వేగంగా నిర్ణయాలు తీసుకోవాలన్నారు. బాధ్యతను మరొకరికి బదిలీచేసే తత్వాన్ని విడనాడాలన్నారు. ముఖ్యమంత్రిగా తాను మూడు నెలల కార్యక్రమాలను ముందే నిర్దేశించుకుంటా నని వెల్లడించారు. ప్రతీ నెలా ఎస్ఐపీబీ సమావేశాలతో పాటు ప్రతీ 15 రోజులకు కేబినెట్ సమావేశంతో పాటు ప్రతీ మూడు నెలలకూ కలెక్టర్ల సదస్సు, ప్రతీ నెలా 4 రోజుల పాటు క్షేత్రస్థాయిలో ప్రజల దగ్గరకు వెళ్తున్నానని అన్నారు. సీఎంగా తనపై కేంద్ర ప్రభుత్వం కూడా ఉంటుందని దానికి అనుగుణంగానే ప్రణాళిక చేసుకుంటున్నట్టు సీఎం కలెక్టర్లకు వివరించారు. కాలాన్ని సద్వినియోగం చేసుకునేలా కలెక్టర్లు కూడా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. నిర్ణయాల్లోనూ ఎస్కేపిజం కుదరదని రియాక్టివ్ గవర్నెన్స్ కంటే ప్రోయాక్టివ్ గవర్నెన్సుకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దిశానిర్దేశం చేశారు.

### యాక్షన్ టేకెన్ రిపోర్టు పై దిశానిర్దేశం

ఎస్సీ వర్గాలకు ఇచ్చే ప్రయోజనాలను బుడగ జంగాలకు పొడిగించే అంశంపై తక్షణం ఉత్తర్వులు జారీ చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. బుడగ జంగాలకు ఎస్సీ హోదా కల్పించే అంశం పెండింగులో ఉన్న నేపథ్యంలో ఎస్సీలకు కలిగే ప్రయోజనాలను వారికీ అందించాలని సీఎం స్పష్టం చేశారు. వివిధ పరిశ్రమలతో నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాన్ని అనుసంధానించాలని అన్నారు. కరిక్యులమ్, పరికరాలు తదితర అంశాలను 90 రోజుల్లోగా పూర్తి చేయాలని సూచించారు. ఇప్పటికే మంజూరైన గృహాలను వేగంగా పూర్తి చేయాలన్నారు. అదనంగా మంజూరు అయ్యే గృహాలను దశలవారీగా అమలు చేయాలని సీఎం నిర్దేశించారు. కేంద్రం నుంచి మరో 1.5 లక్షల గృహాలు ఏపీకి అదనంగా మంజూరు అయ్యే అవకాశం ఉందని సీఎం వెల్లడించారు. ప్రస్తుతం ఎల్ నినో ప్రభావం ఉన్న నేపథ్యంలో రాష్ట్రంలో తాగునీటి సరఫరా విషయంలో అత్యవసర పనుల్ని వేగంగా పూర్తి చేయాలని ముఖ్యమంత్రి నిర్దేశించారు. రాష్ట్రంలో 50 శాతం హరిత ప్రాంతాన్ని సాధించేలా ప్లాంటేషన్ సీజన్ కు ముందే అవసరమైన 20 కోట్ల విత్తనాలను, మొక్కల్ని సిద్ధం చేసుకోవాలన్నారు. తక్కువ నీటి అవసరం ఉన్న మొక్కల్ని ప్రోత్సహించాలని నీటి సంరక్షణ పనులకు ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు. ప్రీమాన్సూన్ డ్రై సోయింగ్ విధానంలో సాగు చేపట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 905 స్మార్ట్ కిచెన్ల ఏర్పాటుకు సంబంధించి కేంద్రంతో మాట్లాడాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు.

# బేతంచెర్లలో 28 వార్డులు..

## 56 పోలింగ్ స్టేషన్లు

**బేతంచెర్ల::** రానున్న మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలోబేతంచెర్ల నగర పంచాయతీ పరిధిలోని పోలింగ్ స్టేషన్ల జాబితాను నగర పంచాయతీ కమిషనర్ హరి ప్రసాద్,గురువారం విడుదల చేశారు.నగర పంచాయతీ పరిధిలో మొత్తం 28 వార్డులకు 56 పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.28 వార్డులకు 56 పోలింగ్ స్టేషన్లుప్రతి వార్డుకు సంబంధించి పోలింగ్ స్టేషన్ల వివరాలను సిద్ధం చేసి జాబితాను విడుదల చేసినట్లు కమిషనర్ తెలిపారు. ఎన్నికల ప్రక్రియలో ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పోలింగ్ కేంద్రాల ఏర్పాటు,మౌలిక సదుపాయాలు తదితర అంశాలపై అధికారులు దృష్టి సారిస్తున్నట్లు పేర్కొన్నారు.అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలిపోలింగ్ స్టేషన్ల జాబితాపై రాజకీయ పార్టీలు,ప్రజలకు ఏవైనా అభ్యంతరాలు,సూచనలు లేదా సలహాలు ఉంటే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని కమిషనర్ హరి ప్రసాద్ కోరారు.ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, నిబంధనల ప్రకారం జరిగేలా అందరి సూచనలను పరిగణనలోకి తీసుకుంటామని తెలిపారు.రేపు అన్ని పార్టీలతో సమావేశంపోలింగ్ స్టేషన్ల జాబితా,ఎన్నికల ఏర్పాట్లు తదితర అంశాలపై చర్చించేందుకు శనివారం అన్ని రాజకీయ పార్టీల నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు కమిషనర్ హరి ప్రసాద్ వెల్లడించారు. ఈ సమావేశానికి అన్ని పార్టీల ప్రతినిధులు హాజరై తమ అభిప్రాయాలను,సూచనలను,అభ్యంతరాలను తెలియజేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలోశబరీష్,జిలాని, మధు కుమార్,అబిదా బేగం,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బ్రిక్స్ సదస్సు సర్వం సిద్ధం

ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయని ప్రధాని నరేంద్ర మోదీ గురువారం ప్రకటించారు. సెప్టెంబర్ 12–13 తేదీల్లో జరిగే ఈ 18వ బ్రిక్స్ సదస్సు కోసం ఢిల్లీలోని భారత్ మండపం సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. ఈ మేరకు ప్రధాని మోదీ 'ఎక్స్' వేదికగా ఒక ప్రత్యేక వీడియోను పంచుకున్నారు. ప్రపంచ నేతలకు స్వాగతం పలికేందుకు సిద్ధమైన భారత్ మండపం వీడియోను షేర్ చేస్తూ, "బ్రిక్స్ 2026కు సర్వం సిద్ధం!" అని ఆయన పేర్కొన్నారు. ఈ సదస్సులో పాల్గొనేందుకు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్, దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రమాఫోసా, ఐరాస సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రస్, ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్ సహా పలువురు సభ్య, భాగస్వామ్య, ఆహ్వానిత దేశాల నేతలు ఢిల్లీకి రానున్నారు.2026 సంవత్సరానికి బ్రిక్స్ కూటమికి భారత్ అధ్యక్షత వహిస్తోంది. 'సుస్థిరత, ఆవిష్కరణ, సహకారం, పునరుత్థానం కోసం నిర్మాణం' అనే థీమ్‌తో ఈ సదస్సును నిర్వహిస్తోంది. "మానవత్వానికే ప్రథమ ప్రాధాన్యం" అనే ప్రధాని మోదీ దార్శనికతకు అనుగుణంగా ఈ థీమ్‌ను ఎంచుకున్నారు. అంతర్గత సహకారాన్ని బలోపేతం చేసుకోవడంతో పాటు, పరస్పర ప్రాధాన్యత ఉన్న ప్రపంచ, ప్రాంతీయ అంశాలపై నేతలు తమ అభిప్రాయాలను పంచుకోనున్నారు. సదస్సు నేపథ్యంలో ఢిల్లీ పోలీసులు, ఇతర ఏజెన్సీలతో కలిసి రాజధానిలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. దాదాపు 15,000 మంది పోలీస్ సిబ్బంది, 200 కంపెనీల పారామిలటరీ బలగాలను మోహరించారు. వీవీఐపీల రాకపోకల కారణంగా పలు మార్గాల్లో ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయని ప్రజలకు ముందుగానే సూచనలు జారీ చేశారు.భారత్ బ్రిక్స్ కూటమికి వ్యవస్థాపక సభ్యదేశం. 2012, 2016, 2021లో కూడా భారత్ అధ్యక్షత వహించింది. ఇప్పుడు నాలుగోసారి ఈ బాధ్యతను స్వీకరించింది. 2026తో బ్రిక్స్ కూటమి ఏర్పడి 20 ఏళ్లు పూర్తి కావడం మరో విశేషం. ఈ ఏడాది జనవరి 1న అధ్యక్ష బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి భారత్ దాదాపు 350కి పైగా సమావేశాలు, ఉన్నత స్థాయి కార్యక్రమాలను నిర్వహించి కూటమి వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని బలోపేతం చేసేందుకు కృషి చేసిందని విదేశాంగ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది.

# అసెంబ్లీ ఘటనపై సర్కార్ ఫ్లాష్ సర్వే

సమావేశంలో ఇటీవల అసెంబ్లీ వద్ద చోటుచేసుకున్న పరిణామాలు, ప్రతిపక్షాల వ్యవహారశైలి, ప్రభుత్వ భవిష్యత్ వ్యూహంపై కీలకంగా చర్చించినట్లు సమాచారం. ఈ సందర్భంగా గత మూడు రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా జరిగిన పరిణామాలపై రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించినట్లు చెబుతున్న ఓ ఫ్లాష్ సర్వే ఫలితాలను సీఎం రేవంత్ రెడ్డి ఎమ్మెల్యేల ముందు ప్రస్తావించినట్లు తెలుస్తోంది.
అసెంబ్లీ వద్ద జరిగిన ఘటనలపై ప్రభుత్వం ఫ్లాష్ సర్వే చేయించిందని సీఎం రేవంత్‌రెడ్డి సమావేశంలో తెలిపారు. ఆ సర్వేలో రాష్ట్ర ప్రభుత్వంపై పెద్దగా వ్యతిరేకత కనిపించలేదని బదులుగా బీఆర్ఎస్ నేతల వ్యవహారశైలినే ప్రజలు తప్పుబట్టినట్లు తేలిందని ఆయన పేర్కొన్నారు. ఈ నెల 7వ తేదీన అసెంబ్లీ గేటు వద్ద చోటుచేసుకున్న పరిణామాలు, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన వివాదం ఎర్రవల్లిలో చోటుచేసుకున్న శుద్ధీకరణ కార్యక్రమం వంటి అంశాలను సీఎం రేవంత్ రెడ్డి ఈ సమావేశంలో ప్రస్తావించినట్లు సమాచారం. ఈ ఘటనలపై ప్రభుత్వం తీసుకున్న చర్యలను కూడా ఎమ్మెల్యేలకు వివరించినట్లు తెలుస్తోంది.ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ అసెంబ్లీ కార్యకలాపాలను సజావుగా సాగనివ్వకుండా కుట్ర చేసిందని సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపించినట్లు సమాచారం. మాజీ సీఎం కేసీఆర్ అధ్యక్షతన ఫామ్‌హౌస్‌లో సమావేశమై సభను అడ్డుకునే వ్యూహాన్ని రూపొందించారని ఆయన విమర్శించినట్లు తెలుస్తోంది. అధికారం కోల్పోయినప్పటికీ బీఆర్ఎస్ నేతలు తమ అహంకార వైఖరిని మార్చుకోలేదని సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించినట్లు సమాచారం.పోలీసు అధికారులు, ప్రజాప్రతినిధుల పట్ల అనుచితంగా వ్యవహరించారని మహిళా పోలీసు అధికారుల ఎదుట టీషర్టులు విప్పడం వంటి ఘటనలు చోటుచేసుకున్నాయని ఆయన ఆరోపించినట్లు తెలుస్తోంది. అలాగే శాసనసభాపతిపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారని సీఎం పేర్కొన్నట్లు సమాచారం. అసెంబ్లీ వద్ద జరిగిన పరిణామాలను ఎదుర్కొని ప్రభుత్వానికి మద్దతుగా నిలిచిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలను రేవంత్‌రెడ్డి అభినందించినట్లు తెలుస్తోంది.కాంగ్రెస్ ఎమ్మెల్యేల పనితీరుపైనా సీఎం రేవంత్‌రెడ్డి సమావేశంలో దిశానిర్దేశం చేసినట్లు సమాచారం. ప్రజలు అప్పగించిన పదవిని బాధ్యతగా నిర్వహించాలని, అసెంబ్లీ జరిగే అన్ని రోజుల్లో సభ్యులు పూర్తి స్థాయిలో హాజరై చర్చల్లో పాల్గొనాలని సూచించినట్లు తెలుస్తోంది. తమ తమ నియోజకవర్గాలకు సంబంధించిన సమస్యలను సభలో ప్రస్తావించాలని ఎమ్మెల్యేలకు సూచించినట్లు సమాచారం. ఎమ్మెల్యేల వ్యక్తిగత పనితీరు, ప్రవర్తన భవిష్యత్ రాజకీయ విజయాలపై ప్రభావం చూపుతుందని సీఎం రేవంత్ రెడ్డి హెచ్చరించినట్లు తెలుస్తోంది. మొదటిసారి ఎన్నికైన ఎమ్మెల్యేల ప్రవర్తన రెండోసారి గెలుపుపై ప్రభావం చూపుతుందని వ్యక్తిగత పనితీరే గెలుపు, ఓటములను నిర్ణయిస్తుందని సీఎం రేవంత్ రెడ్డి శాసన సభ్యులకు సూచించారు. కాంగ్రెస్ నుంచి రాజకీయంగా ఎదిగి ప్రస్తుతం ఆ పార్టీపై విమర్శలు చేస్తున్న కొందరు నేతల వ్యవహారశైలిని కూడా సీఎం రేవంత్ రెడ్డి ప్రస్తావించినట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ అవకాశం ఇవ్వకపోతే సునీతా లక్ష్మారెడ్డి, సబితా ఇంద్రారెడ్డి వంటి నేతలు రాష్ట్రస్థాయి నాయకులుగా ఎదిగేవారా అని ఆయన ప్రశ్నించినట్లు సమాచారం.పోలీసు సిబ్బందిపై జరిగిన ఘటనను ప్రస్తావిస్తూ కేటీఆర్‌కు పోలీసు అధికారుల్లో రేవంత్‌రెడ్డి కనిపించినట్లుగా ఉందని, అందుకే వారిపై అంత ఆగ్రహంతో వ్యవహరించారని సీఎం రేవంత్ రెడ్డి ఎద్దేవా చేసినట్లు తెలుస్తోంది. తెలంగాణలో నిర్వహించిన కులగణన దేశానికి రోల్ మోడల్‌గా నిలిచిందని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నట్లు సమాచారం. తెలంగాణ నమూనాలో దేశవ్యాప్తంగా కులగణన చేపట్టేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు సూచించినట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో కులగణన ద్వారా వచ్చిన అంశాలను జాతీయ స్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లాలని దీనిపై పార్టీ ప్రజాప్రతినిధులు విస్తృతంగా మాట్లాడాలని సీఎం సూచించినట్లు సమాచారం.ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) పేరుతో ఓట్లు తొలగించే కుట్ర జరుగుతోందని సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపించినట్లు సమాచారం. మరోసారి ఎమ్మెల్యేగా గెలవాలని భావించే ప్రతి ఒక్కరూ ఓటు హక్కు పరిరక్షణ అంశాన్ని సీరియస్‌గా తీసుకోవాలని సూచించినట్లు తెలుస్తోంది. దేశంలో వయోజనుల జనాభా, ఓటర్ల జాబితాలో నమోదైన ఓట్ల మధ్య వ్యత్యాసాన్ని ప్రస్తావిస్తూ సీఎం రేవంత్ రెడ్డి పలు ప్రశ్నలు లేవనెత్తినట్లు సమాచారం. అయితే ఈ అంశంపై ఆయన చేసిన వ్యాఖ్యలు రాజకీయ ఆరోపణలేనని ఓటర్ల జాబితా సవరణకు సంబంధించిన తుది నిర్ణయాలు ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారమే జరుగుతాయని గమనించాలి.కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకున్న నేపథ్యంలో అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని సీఎం రేవంత్‌రెడ్డి ఎమ్మెల్యేలకు సూచించినట్లు సమాచారం. ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలు, తీసుకున్న నిర్ణయాలపై ప్రజలకు విస్తృతంగా వివరించాలని, వాటి ఫలితాలను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లాలని సూచించినట్లు తెలుస్తోంది. వెయ్యి రోజుల పాలనలో ఎమ్మెల్యేలు అందించిన సహకారానికి సీఎం కృతజ్ఞతలు తెలిపినట్లు సమాచారం.

# మెగా డీఎస్సీ కాదు..

# దగా డీఎస్సీ

చెప్పలేకపోయిందన్నారు. కనీసం టెట్ అర్హత లేనివారికి, ఒక కేటగిరీ మార్కులను మరో పోస్టుకు వర్తింపజేసి, చివరికి రూల్ ఆఫ్ రిజర్వేషన్లకు పాతరేసి మరీ దొంగచాటుగా ఉద్యోగాలు కట్టబెట్టారని ఆరోపించారు.స్పోర్ట్స్ కోటా పేరుతో జరిగిన అక్రమాలు ఈ స్కామ్‌లో మరీ దారుణమని జగన్ సంచలన ఆధారాలు బయటపెట్టారు. గతంలో ఉన్న 2% స్పోర్ట్స్ కోటాను 3 శాతానికి పెంచి, పరీక్షలు కూడా లేకుండా నేరుగా ఉద్యోగాలు ఇచ్చేలా జీవో 4, 47లను తీసుకొచ్చి, పని పూర్తయ్యాక జీవో 23, 56లతో గేట్లు మూసేశారని ఆరోపించారు. ఖమ్మంలో జరగని సీనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ జూడో ఛాంపియన్‌షిప్–2013 పోటీలలో పాల్గొన్నట్లు ఏపీ జూడో అసోసియేషన్ ఇచ్చిన తప్పుడు సర్టిఫికెట్లతో ఏకంగా 39 మందికి పరీక్షలు లేకుండా టీచర్ పోస్టులు ఇచ్చారన్నారు. అసలు ఆ తేదీల్లో పోటీలే జరగలేదని తెలంగాణ, ఖమ్మం జూడో అసోసియేషన్లు రాతపూర్వకంగా స్పష్టం చేశాయని, ఆశ్చర్యకరంగా ఏపీ జూడో అసోసియేషన్ అధ్యక్షుడిగా ఉన్నది లోకేష్ తోడల్లుడు, విశాఖ ఎంపీ భరత్ అని జగన్ ఎత్తిచూపారు.అలాగే టీడీపీ ఎమ్మెల్యే కూన రవికుమార్ అధ్యక్షుడిగా ఉన్న సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ద్వారా 38 మందికి, జరగని నేషనల్ ఖో–ఖో పోటీల పేరుతో మరికొందరికి పరీక్షలు లేకుండానే పోస్టులు కట్టబెట్టారని జగన్ ఆరోపించారు. విశాఖపట్నంలో యోగేశ్వర్‌రావు అనే అభ్యర్థికి, అతని చెల్లెలికి ఖో–ఖో బోగస్ సర్టిఫికెట్లతో ఎస్‌జీటీ పోస్టులు ఇచ్చారని, తెలంగాణ ఖో–ఖో అసోసియేషన్ రిలీజ్ చేసిన విజేతల జాబితాలో వీరి పేర్లే లేవని నిరూపించారు. కర్నూలు జిల్లాలో ఈడిగ ప్రభాకర్ అనే అభ్యర్థికి కనీస అర్హత మార్కులు రాకపోయినా, స్కూల్ అసిస్టెంట్ మార్కులను చూపిస్తూ ఎస్‌జీటీ పోస్టు కట్టబెట్టిన తీరును డీఈవో కూడా ఒప్పుకున్నారని గుర్తుచేశారు.
ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తప్పుచేశారు కాబట్టే వారి కింద పనిచేసే అధికారుల విచారణతో బాధితులకు న్యాయం జరగదని జగన్ స్పష్టం చేశారు. అక్రమాలు బయటపడినా ఆడియో, వీడియో సాక్ష్యాధారాలు ఉన్నా కేసులను వీకర్ సెక్షన్ల కింద నమోదు చేసి, స్టేషనల్ బెయిళ్లతో మసిపూసి మారేడుకాయ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అందుకే ఈ మెగా డీఎస్సీ కుంభకోణంపై తక్షణమే సీబీఐ విచారణ జరిపించాలని, నిజాయితీగా కష్టపడిన నిరుద్యోగ యువతకు న్యాయం జరిగే వరకు వైఎస్ఆర్‌సీపీ కోర్టుల్లోనూ, ప్రజాక్షేత్రంలోనూ పోరాడుతుందని వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి స్పష్టం చేశారు.

# బీఆర్ఎస్ ఎమ్మెల్సీల బెయిల్ రద్దు చేయాలని కోర్టులో పిటిషన్

అసెంబ్లీ వద్ద జరిగిన ఆందోళన సందర్భంగా పోలీసులతో వాగ్వాదం, విధుల నిర్వహణకు ఆటంకం కలిగించడం , స్పీకర్‌ను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలపై సైఫాబాద్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ కేసులో పోలీసుల రిమాండ్ కోరికను పక్కనబెట్టి, నాంపల్లి కోర్టు ఎమ్మెల్సీలకు బెయిల్ మంజూరు చేసింది. అయితే కోర్టు ఇచ్చిన మినహాయింపులు లేదా నిబంధనలకు విరుద్ధంగా వారు ప్రవర్తించారని, సాక్ష్యాలను , విచారణ ప్రక్రియను ప్రభావితం చేసేలా వ్యవహరించారని పేర్కొంటూ నాంపల్లి కోర్టులో సైఫాబాద్ పోలీసులు బెయిల్ రద్దు పిటిషన్‌ను దాఖలు చేశారు.దీంతోపాటు, ఈ కేసు తీవ్రతను పరిగణనలోకి తీసుకుని కేసును తక్షణమే ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక కోర్టుకు బదిలీ చేయాలని కూడా పోలీసులు నాంపల్లి కోర్టును కోరారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ దళిత సామాజిక వర్గానికి చెందిన నాయకుడు కావడంతో, ఆయనపై చేసిన వ్యాఖ్యలు బాధ్యతా రాహిత్యంగా ఉన్నాయని , అట్రాసిటీ చట్టంలోని నిబంధనలను ఆకర్షిస్తాయని పోలీసులు స్పష్టం చేశారు. ఈ పరిణామంతో కేసు మరింత సీరియస్‌గా మారింది.మరోవైపు, బిఆర్ఎస్ శ్రేణులు ఈ కేసును తీవ్రంగా ఖండిస్తున్నాయి. కేవలం రాజకీయ కక్షసాధింపు చర్యల్లో భాగంగానే ప్రభుత్వం, పోలీసులు వరుస పిటిషన్లతో వేధింపులకు గురిచేస్తున్నారని ఆరోపిస్తున్నారు. చట్టాన్ని గౌరవిస్తూ కోర్టు పరిధిలోనే తాము ఈ అంశాన్ని ఎదుర్కొంటామని, ఎమ్మెల్సీలు ఎటువంటి నిబంధనల ఉల్లంఘనకు పాల్పడలేదని బీఆర్ఎస్ న్యాయ విభాగానికి చెందిన నాయకులు స్పష్టం చేస్తున్నారు. పోలీసులు దాఖలు చేసిన బెయిల్ రద్దు, కేసు బదిలీ పిటిషన్లపై నాంపల్లి కోర్టు త్వరలోనే విచారణ జరిపి తీర్పు వెలువరించనుంది. ఒకవేళ కోర్టు పోలీసుల విజ్ఞప్తిని అంగీకరించి బెయిల్ రద్దు చేస్తే, ఎమ్మెల్సీలు ఇద్దరూ జైలుకు వెళ్లే అవకాశాలు ఉన్నాయి. దీనితో పాటు ఎస్సీ, ఎస్టీ కోర్టుకు కేసు బదిలీ అయితే మరింత కఠినమైన చట్టపరమైన విచారణను ఎదుర్కోవాల్సి ఉంటుంది. ఈ పిటిషన్లపై కోర్టు ఇచ్చే ఉత్తర్వులు తెలంగాణ రాజకీయాల్లో సంచలనంగా మారనున్నాయి.

# ఉద్యోగులకు రూ.కోటి బీమా

ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి బీమా కవరేజీ కల్పిస్తోందన్నారు. ఈ మేరకు 2024 జూన్ 26న ఆర్థిక శాఖ 77వ జీవో సర్క్యులర్ జారీ చేసింది. పథకం అమలు విధానం, అర్హతలు, బీమా కవరేజీ, నిబంధనలు, షరతులను అందులో పేర్కొంది అని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క చెప్పుకొచ్చారు.

### 12.91 లక్షల మందికి కవరేజీ

'రాష్ట్రంలో మొత్తం 12,91,056 మంది ఈ పథకం పరిధిలో ఉన్నట్లు ప్రభుత్వం తెలిపింది. వీరిలో 5,18,293 మంది రెగ్యులర్ ఉద్యోగులు ఉన్నట్లు చెప్పారు. ఇంకా 5,00,158 మంది తాత్కాలిక, ఔట్‌సోర్సింగ్, మల్టీపర్పస్ వర్కర్లు, కాంట్రాక్ట్, డైలీవేజ్, ఎన్ఆర్ఈజీఎస్, ఎంటీఎస్, సెర్ప్ తదితర సిబ్బంది ఉన్నారు. 2,72,600 మంది పెన్షనర్లు, కుటుంబ పెన్షనర్లు ఉన్నారు'అని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క చెప్పుకొచ్చారు.

### సింగరేణితో శ్రీకారం

ఉద్యోగుల కోసం రూ.కోటి బీమా పథకానికి తొలుత సింగరేణి కాలరీస్‌లో శ్రీకారం చుట్టినట్లు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. అనంతరం విద్యుత్ శాఖ పరిధిలోని డిస్కమ్‌లు, ఇతర సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు పథకాన్ని విస్తరించినట్లు చెప్పారు. చివరగా రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులందరికీ వర్తించేలా విస్తరించినట్లు పేర్కొన్నారు. సింగరేణి ఉద్యోగులకు 2024 ఫిబ్రవరిలో, ఇంధన శాఖ ఉద్యోగులకు 2025లో, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులందరికీ 2026 జూన్ 25 నుంచి పథకం వర్తించేలా చర్యలు తీసుకున్నట్లు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క వివరించారు.

### ప్రభుత్వానికి రూపాయి భారం లేదు

ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు చెల్లిస్తున్న బ్యాంకులతో ప్రభుత్వం చర్చలు జరిపి ఈ పథకాన్ని అమలు చేస్తున్నట్లు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క చెప్పారు. ఉద్యోగుల జీతాలు తమ బ్యాంకుల ద్వారా జమ అవుతున్నందున, బ్యాంకులకు వ్యాపార పరంగా ప్రయోజనం కలుగుతున్న నేపథ్యంలో బీమా పథకానికి బ్యాంకులే సహకరించేలా ఒప్పందం చేసుకున్నట్లు వెల్లడించారు. దీంతో ప్రభుత్వంపై, ఉద్యోగులపై ఎలాంటి ప్రీమియం భారం లేకుండా పథకం అమలవుతోందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు.

### ఇప్పటికే క్లెయిమ్‌ల పరిష్కారం

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించి ఇప్పటివరకు 33 క్లెయిమ్‌లు వచ్చాయని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. అందులో 24 క్లెయిమ్‌లను పరిష్కరించినట్లు ప్రకటించారు. విద్యుత్ శాఖకు చెందిన ఎస్పీడీసీఎల్, ఎన్‌పీడీసీఎల్, టీజీ జెన్‌కో, ట్రాన్స్‌కో పరిధిలో 15 క్లెయిమ్‌లు రాగా, అన్నింటినీ పరిష్కరించినట్లు చెప్పారు. ఈ విభాగంలో రూ.15 కోట్లకు పైగా చెల్లింపులు జరిగినట్లు వెల్లడించారు. ఇదిలా ఉండగా సింగరేణి కాలరీస్‌లో 50 క్లెయిమ్‌లు రాగా అన్నింటిని పరిష్కరించినట్లు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు.

### ఉద్యోగులకు రూ.1.20 కోట్లు

ప్రమాదవశాత్తు మరణించిన ఉద్యోగి కుటుంబానికి రూ.కోటి బీమాతో పాటు ఇతర ప్రయోజనాలు కలిపి రూ.1.20 కోట్ల వరకు ప్రయోజనం అందేలా చర్యలు తీసుకున్నట్లు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క చెప్పారు. విమాన ప్రయాణ సమయంలో ప్రమాదం జరిగితే రూ.2 కోట్ల వరకు బీమా ప్రయోజనం కల్పిస్తున్నట్లు వెల్లడించించారు. సహజ మరణానికి రూ.10 లక్షల వరకు ప్రయోజనం కల్పించే వెసులుబాటు కూడా ఉన్నట్లు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క చెప్పారు.

### కేంద్రం, ఇతర రాష్ట్రాలు అధ్యయనం

తెలంగాణలో ప్రారంభించిన ప్రమాద బీమా పథకాన్ని కేంద్ర ప్రభుత్వం అధ్యయనం చేసిందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సభకు చెప్పారు. ఇతర రాష్ట్రాలు సైతం తెలంగాణలో అమలు చేస్తున్న ఈ బీమా విధానాన్ని పరిశీలించేందుకు ఆసక్తి చూపుతున్నాయని చెప్పారు. తమిళనాడు కూడా ఈ తరహా పథకాన్ని అమలు చేసినట్లు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క వెల్లడించారు.

### ఉద్యోగులకు హెల్త్‌కార్డు

బీమా పథకంతో పాటు ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల కోసం హెల్త్‌కార్డు పథకాన్ని కూడా తీసుకొచ్చినట్లు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క చెప్పారు. దశాబ్దాలుగా ఉద్యోగ సంఘాలు కోరుతున్న క్యాష్‌లెస్ వైద్య సేవల కలను ప్రభుత్వం సాకారం చేసిందని ఆయన చెప్పారు. ఉద్యోగులు, వారి సంఘాల ప్రతినిధులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, సంబంధిత ముఖ్య కార్యదర్శులతో కమిటీ ఏర్పాటు చేసి చర్చల అనంతరం హెల్త్‌కార్డుల విధానాన్ని ఖరారు చేసినట్లు వివరించారు. క్యాష్‌లెస్ వైద్యం, సీజీహెచ్ఎస్ ప్యాకేజీ వంటి సదుపాయాలు అందుబాటులోకి తీసుకొచ్చినట్లు ఆయన చెప్పారు. హెల్త్‌కార్డు పథకం కోసం ఇప్పటికే సుమారు రూ.240 కోట్ల నిధులు కేటాయించినట్లు ఉప ముఖ్యమంత్రి చెప్పారు. ఉద్యోగుల సంక్షేమానికి బీమా, ఆరోగ్య భద్రతకు హెల్త్‌కార్డు, రెండు పథకాలూ ఉద్యోగ కుటుంబాలకు ఆర్థిక, వైద్య భరోసా కల్పించేలా రూపొందించామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క శాసనసభకు చెప్పారు.

# బేతంచెర్లలో వినాయక చవితి ఉత్సవాలపై

# సమన్వయ సమావేశం

**బేతంచెర్ల :** వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలోభక్తిశ్రద్ధలతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా నిర్వహించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు.ఇందులో భాగంగా బేతంచెర్ల నగర పంచాయతీ కార్యాలయంలో గణేష్ ఉత్సవ కమిటీ నిర్వాహకులతో సమన్వయ సమావేశం నిర్వహించారు.నగర పంచాయతీ కమిషనర్ హరి ప్రసాద్,ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి తహసీల్దార్ నాగమణి,సీఐ వెంకటేశ్వరరావు, విద్యుత్ శాఖ ఏడి మధుసూదన్ హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గణేష్ మండపాల ఏర్పాటు తో పాటు విగ్రహ ప్రతిష్ట కొరకు ఆన్లైన్లో నమోదు చేసుకొని సంబంధిత పోలీస్ శాఖ అనుమతులు తీసుకోవాలని, ఉత్సవాల నిర్వహణ,భక్తులకు ఇబ్బందులు లేకుండా తీసుకోవాల్సిన చర్యలు,ట్రాఫిక్ నియంత్రణ, విద్యుత్ భద్రత,శబ్ద కాలుష్య నియంత్రణ తదితర అంశాలపై అధికారులు ఉత్సవ కమిటీ నిర్వాహకులతో చర్చించారు.ప్రత్యేకంగా గణేష్ విగ్రహాల నిమజ్జనం సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నిమజ్జన కార్యక్రమాన్ని క్రమబద్ధంగా నిర్వహించడం,భక్తులు మరియు ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయడం వంటి అంశాలపై అధికారులు పలు సూచనలు చేశారు.వినాయక చవితి ఉత్సవాలను అందరూ సమన్వయంతో నిర్వహించి,శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా సహకరించాలని అధికారులు కోరారు.ఉత్సవ కమిటీ నిర్వాహకులు కూడా అధికారుల సూచనలు పాటిస్తూ ఉత్సవాలను విజయవంతంగా నిర్వహిస్తామని తెలిపారు.ఈ సమావేశానికి నగర పంచాయతీ చైర్మన్ సిహెచ్ చలం రెడ్డి, గణేష్ నిర్వహణ కమిటీ చైర్మన్ గౌరు హుస్సేన్ రెడ్డి,కార్యవర్గ సభ్యులు నాగేశ్వర్ రెడ్డి,శ్రీధర్ రెడ్డి,కందగడ్డల మోహన్రావు ఆ రామ్మూర్తి వీరారెడ్డి,నాగ మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

# సర్కార్ భూములపై అనుముల గద్దలు!

### టెస్సెరాక్ట్ కు కేటాయించిన భూముల పరిశీలన

వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీష్ రావు నేతృత్వంలోని సస్పెండెడ్ ఎమ్మెల్యేల బృందం తుక్కుగూడ వద్ద ఉన్న టెస్సెరాక్ట్ ఆవరణకు చేరుకుని క్షేత్రస్థాయి పరిశీలన జరిపింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోదరుడు కొండల్ రెడ్డికి లాభం చేకూర్చేలా ప్రభుత్వం ఈ ప్రాంతంలో వేలాది కోట్ల విలువైన అత్యంత ఖరీదైన భూములను దారాదత్తం చేసిందని గులాబీ నేతలు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అసెంబ్లీలో మాట్లాడే అవకాశం ఇవ్వకుండా సస్పెండ్ చేసినా, ప్రజల తరఫున క్షేత్రస్థాయిలో ఈ భూకుంభకోణాలను ఎండగడతామని స్పష్టం చేశారు.

### రేవంత్ సోదరుల దోపిడి అని ఆరోపణలు

ఫ్యూచర్ సిటీ, తుక్కుగూడ, రావిర్యాల పరిసరాల్లో చేపట్టిన ప్రాజెక్టులకు సంబంధించి ప్రభుత్వం జారీ చేసిన జీవోలు, నిర్వహించిన టెండర్లు, భూకేటాయింపుల ప్రక్రియపై బీఆర్ఎస్ నేతలు పదునైన ప్రశ్నలు సంధించారు. ప్రజా ప్రయోజనాల పేరుతో పేద, మధ్యతరగతి రైతులకు చెందిన భూములను స్వాధీనం చేసుకుని, వాటిని సీఎం బంధువుల సొంత సంస్థలకు, కంపెనీలకు అప్పగిస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ హయాంలో రియల్ ఎస్టేట్ మాఫియా ఏ స్థాయిలో చెలరేగిపోతోందో చెప్పడానికి తుక్కుగూడ, రావిర్యాల కేటాయింపులే పక్కా నిదర్శనమని విమర్శించారు.

### సస్పెండ్ చేయడంతో వీధుల్లోకి బీఆర్ఎస్ పోరాటం

ఈ క్షేత్రస్థాయి పర్యటన నేపథ్యంలో రావిర్యాల, ఫ్యూచర్ సిటీ పరిసర ప్రాంతాల్లో తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. సస్పెండెడ్ ఎమ్మెల్యేలను, బీఆర్ఎస్ శ్రేణులను అడ్డుకునేందుకు పోలీసులు భారీగా బారికేడ్లు ఏర్పాటు చేసి, భద్రతా ఆంక్షలు విధించారు. శాసనసభ సమావేశాలు జరుగుతున్న సమయంలో సస్పెన్షన్‌కు గురైన ప్రజాప్రతినిధులు నేరుగా ఘటనా స్థలానికి వచ్చి నిరసన తెలపడం, పోలీసులతో వాగ్వాదానికి దిగడంతో హైడ్రామా చోటుచేసుకుంది. ప్రభుత్వ తీరును నిరసిస్తూ బీఆర్ఎస్ శ్రేణులు కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా నినాదాలతో హోరెత్తించారు. అసెంబ్లీలో డిఫెన్స్‌లో పడేసేందుకు కాంగ్రెస్ సర్కార్ వేసిన సస్పెన్షన్ ఎత్తుగడను బీఆర్ఎస్ ఈ ఫ్యూచర్ సిటీ భూ దండయాత్ర ద్వారా తిప్పికొట్టే ప్రయత్నం చేసింది. ప్రభుత్వం సభలో ప్రతిపక్షాల గొంతు నొక్కాలని చూసినా, క్షేత్రస్థాయిలో 'ప్రజా క్షేత్రం'లోనే ప్రభుత్వాన్ని నిలదీస్తామని కేటీఆర్, హరీష్ రావు తేల్చి చెప్పారు. కాంగ్రెస్ వైఫల్యాలు, రేవంత్ కుటుంబంపై వస్తున్న భూఆరోపణలపై లీగల్‌గా, పొలిటికల్‌గా పోరాటాన్ని ఉధృతం చేస్తామని సంకేతాలు ఇవ్వడంతో, తెలంగాణలో ఫ్యూచర్ సిటీ రాజకీయం ముమ్ముందు మరింత రగిలేలా కనిపిస్తోంది.

# నిమజ్జనానికి హైడ్రా వ్యతిరేకం కాదు

బయోడైవర్సిటీ, నేచురల్ వెట్‌ల్యాండ్ వంటి ప్రత్యేక హోదాలతో గుర్తించిన కొన్ని చెరువుల్లో మాత్రమే విగ్రహాల నిమజ్జనాలపై పరిమితులు ఉన్నాయని ఏవీ రంగనాథ్ వివరించారు. మరీ ముఖ్యంగా అమీన్‌పూర్ పెద్ద చెరువును దేశంలోనే ప్రథమంగా బయోడైవర్సిటీ ప్రాంతంగా కేంద్ర ప్రభుత్వం గుర్తించిన విషయాన్ని ఆయన ప్రస్తావించారు. అదేవిధంగా కాప్రా చెరువును కేంద్ర ప్రభుత్వం నేచురల్ వెట్‌ల్యాండ్‌గా గుర్తించిందని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ తెలిపారు. ఈ ప్రాంతాల్లోని సహజ పర్యావరణ వ్యవస్థ దెబ్బతినకుండా రూల్స్ పాటించాల్సిన అవసరం ఉందని గుర్తు చేశారు. ప్రస్తుతం కాప్రా చెరువులో నీరు కూడా లేదని అక్కడ అనవసర సమస్యలు సృష్టించకుండా నగర ప్రజలు చట్టాన్ని గౌరవించాలని విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) పరిధిలో సుమారు 1300 చెరువులు ఉన్నాయని వాటిలో 24 చెరువులను హైడ్రా అభివృద్ధి చేస్తోందని ఏవీ రంగనాథ్ తెలిపారు. హైడ్రా పునరుద్ధరిస్తున్న చెరువుల వద్ద గణేష్ నిమజ్జనాలపై ఎలాంటి ఆంక్షలు లేవని ఆయన స్పష్టం చేశారు. గణేష్ ఉత్సవ కమిటీలకు ఇబ్బందులు కలగకుండా ప్రధాన నీటి వనరులు దెబ్బతినకుండా తాము చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. నిమజ్జనాల కోసం అవసరమైన చోట ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. మట్టి విగ్రహాలతో పాటు పీవోపీ (ప్లాస్టర్ ఆఫ్ పారిస్) విగ్రహాల నిమజ్జనం కోసం కూడా అవసరమైన చోట ప్రత్యేక స్థలాలను కేటాయించేలా ఏర్పాట్లు చేస్తున్నామని హైడ్రా రంగనాథ్ తెలిపారు. గణేష్ విగ్రహాల నిమజ్జన ప్రక్రియ వల్ల చెరువులు, ప్రధాన నీటి వనరులకు నష్టం కలగకుండా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. గణేష్ నవరాత్రుల సందర్భంగా హైదరాబాద్ నగరంలో పెద్ద సంఖ్యలో విగ్రహాలు నిమజ్జనం కానున్న నేపథ్యంలో అధికారులు ముందస్తు ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తులు, ఉత్సవ కమిటీలు అధికారుల సూచనలు పాటించాలని హైడ్రా కోరుతోంది. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో తయారు చేసిన గణేష్ విగ్రహాల వల్ల నీటి వనరులు కాలుష్యానికి గురయ్యే అవకాశం ఉందని ఈ సందర్భంగా హైడ్రా కమిషనర్ రంగనాథ్ తెలిపారు. అలాంటి విగ్రహాలను పూర్తిగా నివారించడం వెంటనే సాధ్యం కాకపోయినా ప్రజల్లో అవగాహన పెంచాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. పర్యావరణాన్ని కాపాడేందుకు వీలైనంత వరకు మట్టి గణపతి విగ్రహాలను పూజించాలని ఆయన సూచించారు. భక్తి, సంప్రదాయాలను కొనసాగిస్తూనే చెరువులు, నీటి వనరుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. మొత్తంగా, హైదరాబాద్‌లోని అన్ని చెరువులపై గణేష్ నిమజ్జనాలకు ఆంక్షలు విధించారనే ప్రచారానికి హైడ్రా కమిషనర్ ప్రకటనతో స్పష్టత వచ్చినట్లయింది. కేంద్రం ప్రత్యేకంగా నోటిఫై చేసిన కొన్ని చెరువుల్లో మాత్రమే పర్యావరణ నిబంధనల కారణంగా పరిమితులు ఉంటాయని, హైడ్రా పునరుద్ధరిస్తున్న మిగతా చెరువుల్లో నిమజ్జనాలకు ఎలాంటి ఆంక్షలు లేవని రంగనాథ్ వెల్లడించారు.

## తిరుపతిలో ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవ అవగాహన ర్యాలీ



**తిరుపతి** ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం సందర్భంగా తిరుపతి జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి (డీయమ్ మరియు హెచ్ఓ ) డాక్టర్ వి . బాలకృష్ణ నాయక్ జెండా ఊపి ఈ ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఒత్తిడిలో ఉన్నవారి బాధలను ప్రేమతో వినడం, సహాయం అందించడం ద్వారా ఆత్మహత్యలను నివారించవచ్చని చెప్పారు. " చేంజింగ్ ది నర్రాటివ్ ఆన్ సూసైడ్ స్టార్ట్ ది కన్వర్షన్ " అనే సందేశంతో మానసిక ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ బహిరంగంగా మాట్లాడాలని పిలుపునిచ్చారు. ?డిఎంహెచ్ఓ కార్యాలయం నుండి ఎస్వీ మెడికల్ కాలేజీ వరకు సాగిన ఈ ర్యాలీలో డి ఎం హెచ్ పి నోడల్ ఆఫీసర్ డాక్టర్ ఉదయ్ కిరణ్, ఎన్ సి డి ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ పి . రెడ్డి ప్రసాద్, సైకియాట్రిక్ సోషల్ వర్కర్ యాసిన్, వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు మరియు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# కొత్త పెన్షన్ల పరిశీలన..

**- పోలింగ్ కేంద్రాల తనిఖీ - గ్రామాల్లో పర్యటించిన ఎంపీడీవో మేరి**

**కొత్తపల్లి, సెప్టెంబర్ 10:** కొత్తపల్లి మండలంలోని పలు గ్రామాల్లో ఎంపీడీవో, పంచాయతీ కార్యదర్శులు గురువారం విస్తృతంగా పర్యటించి వివిధ ప్రభుత్వ కార్యక్రమాలు, అభివృద్ధి పనులను పరిశీలించారు. కొక్కెరంచ గ్రామంలోని ఎస్‌జీఎస్‌డబ్ల్యూ కార్యాలయంలో కొత్త పెన్షన్లకు సంబంధించిన దరఖాస్తుల పరిశీలన, వెరిఫికేషన్ ప్రక్రియను అధికారులు పరిశీలించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి కేంద్రంలో అందుతున్న సేవలు, నిర్వహణ తీరును పరిశీలించారు. నందికుంట గ్రామపంచాయతీ పరిధిలో గోకుల్ షెడ్ నిర్మాణానికి చేపడుతున్న మార్కింగ్ పనులను కూడా ఎంపీడీవో పరిశీలించారు. పనులు నిబంధనల ప్రకారం చేపట్టాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. అదేవిధంగా నందికుంట, దూద్యాల, కొక్కెరంచ గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను ఎంపీడీవో, పంచాయతీ కార్యదర్శులు సందర్శించారు. పోలింగ్ కేంద్రాల్లో అందుబాటులో ఉన్న మౌలిక వసతులు, అవసరమైన ఏర్పాట్లను పరిశీలించి సంబంధిత సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో పారదర్శకత పాటిస్తూ, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రయోజనం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులు సూచించారు. గ్రామాల్లో అభివృద్ధి పనులు, సంక్షేమ కార్యక్రమాల అమలును నిరంతరం పర్యవేక్షిస్తామని తెలిపారు.

# జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్లో కొండ సురేఖ మాజీ ఓఎస్డి సుమంత్

**హైదరాబాద్** మాజీమంత్రి కొండా సురేఖ మాజీ ఓస్డీ సుమంత్ గురువారం నాడు జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్లో పోలీసుల ముందు హాజరైయాడు. ఇన్ని రోజులు పోలీసుల ముందు హాజరవ్వకుండా ఎందుకు ఉన్నారు అని మీడియా అడిగితే సమాధానం చెప్పకుండా పోలీస్ స్టేషన్లోకి పరుగులు తీసాడు.

## భూముల రీ-సర్వేను మార్గదర్శకాలకు అనుగుణంగా పకడ్బందీగా నిర్వహించాలి



**సిద్దిపేట** భూముల రీ-సర్వేను మార్గదర్శకాలకు అనుగుణంగా పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి సర్వే అధికారులను ఆదేశించారు. చిన్నకోడూర్ మండలం చెర్ల అంకిరెడ్డి పల్లి గ్రామంలోని గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించిన భూ భారతి - భూ సర్వే,రీ-సర్వే అవగాహన కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీ కిరణ్ తో కలిసి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ. భూముల సర్వే 1935 సంవత్సరంలో జరిగింది మళ్లీ 2026 సంవత్సరంలో భూ సర్వే చేస్తున్నట్లు తెలిపారు. వాస్తవానికి ప్రతి 25 సంవత్సరాలకు ఒకసారి భూముల సర్వే నిర్వహించాల్సి ఉంటుందనీ తెలిపారు. ప్రభుత్వం ఈ రి-సర్వే కోసం ఆరు ఏడు లక్షలతో అధునాతన పద్ధతులు సర్వే చేయడానికి రోవర్స్ లను కొనుగోలు చేసిందని, దీనివల్ల అత్యంత ఖచ్చితత్వంతో భూములను కొలిచి పగడ్బందీగా హద్దులను ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. భూములలో కొనుగోలు చేయడం అమ్మడం మూలంగా సర్వే నంబర్లలో సబ్ నెంబర్లు మారడం, పట్టా ఒకరిది కబ్జాదారులు ఒకరుగా ఉన్నాయని ఇలాంటి సమస్యలకు ఈ రీ-సర్వేలో ఖచ్చితమైన పరిష్కారాన్ని సూచిస్తున్నట్లు అందుకుగాను రైతులు, అధికారులకు సహకారం అందించాలని తెలిపారు. రీ-సర్వే ప్రక్రియను ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా పకడ్బందీగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. రీ సర్వే ద్వారా అనేక భూ సమస్యలకు పరిష్కారం లభించే అవకాశం ఉన్నందున ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, ఖచ్చితత్వంతో నిర్వహించాలని సూచించారు. రీ సర్వే చేపట్టే ముందు రైతులకు ముందుగానే సమాచారం అందించాలని, రైతుల సమక్షంలోనే భూముల సర్వే ప్రక్రియను నిర్వహించాలని ఆదేశించారు. ప్రతి భూమి హద్దులను, కోఆర్డినేట్లను ఖచ్చితంగా గుర్తించి నమోదు చేయాలని సూచించారు. రీ సర్వేలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నందున భూముల హద్దులు, కోఆర్డినేట్ల నమోదులో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు. రీ సర్వే పూర్తయిన అనంతరం ప్రతి రైతుకు వారి భూమికి సంబంధించిన మ్యాప్‌ను ఖచ్చితమైన కోఆర్డినేట్లతో అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. భవిష్యత్తులో భూ వివాదాలకు అవకాశం లేకుండా రీ సర్వే ప్రక్రియను నాణ్యతతో పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సర్వే ల్యాండ్ అధికారి సుదర్శన్, సర్పంచ్ గాలిపల్లి అనిల్, తహసిల్దార్ సలీం, సర్వే అధికారులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయ విద్యుత్ కోసం రైతుల ధర్నా



**వనపర్తి** 12 గంటల విద్యుత్ హామీ.. ఆరు గంటలు కూడా సక్రమంగా సరఫరా కావడం లేదంటూ రైతుల ఆగ్రహం వ్యవసాయానికి విద్యుత్ సరఫరా సక్రమంగా అందక పంటలుఎండిపోతున్నాయని ఆరోపిస్తూ వనపర్తి మండలం కడుకుంట్ల గ్రామ పెద్దగూడెం రైతులు ఆందోళనకు దిగారు. కడుకుంట్ల గ్రామ విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట, కడుకుంట్ల?వనపర్తి ప్రధాన రహదారిపై రైతులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. వ్యవసాయానికి 12 గంటల విద్యుత్ సరఫరా చేస్తామని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ, కనీసం ఆరు గంటలు కూడా సక్రమంగా, నాణ్యమైన విద్యుత్ అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ కోతల కారణంగా బోర్లు, మోటార్లు పనిచేయక పంటలకు సాగునీరు అందక పంటలు ఎండిపోతున్నాయని తెలిపారు. గతంలో విద్యుత్ అందుబాటు తక్కువగా ఉన్న సమయంలోనూ అప్పటి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ సరఫరా చేశారని రైతులు గుర్తుచేశారు. ప్రస్తుతం విద్యుత్ అందుబాటులో ఉన్నప్పటికీ రైతులను ఎందుకు ఇబ్బందులకు గురిచేస్తున్నారని ప్రశ్నించారు. వ్యవసాయానికి నిరంతర విద్యుత్ సరఫరా చేసి పంటలను కాపాడాలని డిమాండ్ చేశారు. రైతుల ఆందోళన నేపథ్యంలో అధికారులు అక్కడికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. ఎల్‌నినో ప్రభావం కారణంగా విద్యుత్ డిమాండ్ పెరగడంతో సరిపడా విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఎలక్ట్రికల్ డీఈ శ్రీనివాసులు రైతులకు వివరించినట్లు తెలిపారు. అనంతరం అడిషనల్ కలెక్టర్ ఖీమ్యా నాయక్, ఎలక్ట్రికల్ డీఈ శ్రీనివాసులు రైతులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. వ్యవసాయానికి నిరంతరంగా విద్యుత్ సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటామని రైతులకు నచ్చజెప్పడంతో రైతులు ఆందోళనను విరమించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు కేమాణిక్యం, రఘు వర్ధన్ రెడ్డి, మాధవరెడ్డి,ధర్మ నాయక్, దేగ మహేశ్వర్ రెడ్డి, చిట్యాల రాము, లక్ష్మీకాంత్ రెడ్డి, సర్పంచ్ తిరుపతయ్య, మాజీ సర్పంచ్ హరిత బాలకృష్ణ, మాజీ సర్పంచ్ కొండయ్య, కృష్ణ నాయక్, మనీష్, గ్రామ అధ్యక్షులు వెంకటేష్ అశోక్ నాయకులు రైతులు తదితరులు పాల్గొన్నారు

# ఉత్తమ ఉపాధ్యాయునికి ఘన సన్మానం

**తుగ్గలి:** ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయునిగా ఎన్నికైన తుగ్గలి మండల పరిధిలోని గల లక్ష్మీ తాండ ఎంపీపీ పాఠశాల ఉపాధ్యాయునిగా విధులు నిర్వహిస్తున్న అద్దంకి చంద్రమోహన్ ను తుగ్గలి మండలం ఎంఈఓ లు ప్రవీణ రమా వెంకటేశ్వర్లు శాలువాను కప్పి పూలమాల వేసి ఘనంగా సన్మానించారు. గురువారం రోజున మండల కేంద్రమైన తుగ్గలిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల యందు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు,రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చేతులమీదుగా రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయునిగా అవార్డు అందుకున్న అద్దంకి చంద్రమోహన్ ను వారు ఘనంగా సన్మానించారు. మండల పరిధిలోని మారుమూల గిరిజన ప్రాంతంలో గల ఉపాధ్యాయున్ని రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయునిగా ఎన్నుకోవడం చాలా సంతోషకరమన వారు తెలియజేశారు. విద్యార్థుల అభ్యున్నతి కొరకు ఆయన చేస్తున్న కృషిని వారు కొనియాడారు. ఈ కార్యక్రమంలో తుగ్గలి జడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు ఆగస్టీన్,ఉపాధ్యాయులు,సీఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

# రుద్రవరం కేజీబీవీలో

## ఆత్మహత్యల నివారణపై అవగాహన కార్యక్రమం



**రుద్రవరం** రుద్రవరం కేజీబీవీ పాఠశాలలో గురువారం ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని కౌన్సిలర్ ఆర్. హనీఫా మరియు సిబ్బంది ఆధ్వర్యంలో "చర్య ద్వారా ఆశను కల్పిద్దాం" అనే ఇతివృత్తంతో విద్యార్థులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల్లో మానసిక ధైర్యాన్ని, ఆశావాదాన్ని పెంపొందించేలా 'హోప్ ట్రీ', చర్చలు మరియు చిన్న నాటికల ద్వారా ఒత్తిడి నిర్వహణ, తోటివారికి అండగా నిలవడం వంటి అంశాలపై దిశానిర్దేశం చేశారు. సమస్యలు వచ్చినప్పుడు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు లేదా కౌన్సిలర్ సహాయం తీసుకోవాలని వివరిస్తూ, "సహాయం కోరడం బలహీనత కాదు, అది ధైర్యానికి గుర్తు" అని కౌన్సిలర్ విద్యార్థులకు సూచించారు. చివరగా విద్యార్థులతో ఆశ, దయలపై ప్రతిజ్ఞ చేయించగా, పాఠశాలలో స్నేహపూర్వక వాతావరణం ఏర్పాటు చేయడానికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని ఉపాధ్యాయులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

# అర్ధ శతాబ్దపు ఆధ్యాత్మిక వైభవానికి చిన్న జీయర్ స్వామి



**వనపర్తి** వనపర్తి శ్రీ వేంకటేశ్వర స్వామి స్వర్ణోత్సవ వేడుకలకు హాజరుకావాలని ఆహ్వానించిన ఆలయ ధర్మకర్త రఘునాథచార్యులు, శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి .సానుకూలంగా స్పందించిన చిన్న జీయర్ స్వామి. వచ్చే ఏడాది మార్చి 10, 11, 12 తేదీల్లో జరిగే ఈ ఆధ్యాత్మిక వేడుకలకు హాజరవుతానన్నా చిన్నజీయర్ స్వామి. వనపర్తి శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం నిర్మించి 50 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా నిర్వహించనున్న స్వర్ణోత్సవ మహోత్సవాలకు చిన్న జీయర్ స్వామివారు హాజరుకానున్నారు. వచ్చే ఏడాది మార్చి నెలలో జరిగే ఈ ఆధ్యాత్మిక వేడుకలకు హాజరుకావాలని ఆలయ ధర్మకర్త రఘునాథాచార్యులు, వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి కలిసి చిన్న జీయర్ స్వామిని ఆహ్వానించారు. ఆహ్వానాన్ని స్వీకరించిన చిన్న జీయర్ స్వామి సానుకూలంగా స్పందించి, మార్చి 10, 11, 12 తేదీల్లో వనపర్తికి విచ్చేస్తామని హామీ ఇచ్చారు. 5 దశాబ్దాల ఆలయ ఆధ్యాత్మిక ప్రస్థానానికి గుర్తుగా జరిగే స్వర్ణోత్సవాలను భక్తిశ్రద్ధలతో, వైభవంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ ఏర్పాట్లు చేస్తున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ ఆహ్వానానికి ఎమ్మెల్యే కుటుంబ సమేతంగ సతీమణి శారదా రెడ్డి, కుమారుడు నవనీత్ రెడ్డి తో వెళ్లి ఆహ్వానం పలికారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, మార్కెట్ యార్డు మాజీ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎంపీపీ కిచ్చారెడ్డి, గాఒరె రమేష్, తిరుమల మహేష్, వికాస తరంగిణి సభ్యులు, ఆలయ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## ఆత్మహత్యే శరణ్యం కాదు.. జీవితం ఎంతో ఉంది...

**- డిసిపిఓ స్వప్న ప్రియదర్శిని.. - చాగలమర్రి**



మానవ జీవితాన్ని బ్రతికి సాధించాలి తప్ప ఆత్మహత్య శరణ్యం కాదని, జీవితం ఎంతో ఉందని అర్ధాంతరంగా జీవితం ముగిసిపోకుండా జయించాలని జిల్లా బాలల సంరక్షణ అధికారి ( డిసిపిఓ ) స్వప్న ప్రియదర్శిని అన్నారు. గురువారం చాగలమర్రిలోని కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాల కళాశాల ప్రాంగణంలో అంతర్జాతీయ ఆత్మహత్యల నివారణ దినోత్సవం సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమానికి డిసిపిఓ హాజరయ్యారు. ఈమెతో పాటు మానసిక కౌన్సిలర్ డాక్టర్ వి రత్న కిషోర్ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి చిన్న విషయానికి సున్నితత్వంతో ఆలోచించకుండా, క్షణికా వేశానికి గురికాకుండా జ్ఞాన యుక్తంగా సమస్యను ఎదుర్కోవాలన్నారు. ఆశ ఉంది జీవితం ఉంది అనే నినాదంతో బాల బాలికలు వారి గళం విప్పి ధైర్యంగా మాట్లాడే విధంగా, సమస్యలను ధైర్యంగా ఎదుర్కొనుటకు విద్యార్థులకు, మరి ముఖ్యంగా కిషోర బాలికలకు ప్రతి ఒక్కరూ అవగాహన కల్పించాల్సిన బాధ్యత ఉందన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థినులను సాటి విద్యార్థిని వద్ద అవహేళనగా మాట్లాడకూడదని, వారిలో ఉన్న ప్రతిభను గుర్తించి ఉన్నత స్థాయికి తీసుకురావాల్సిన బాధ్యత ఉపాధ్యాయునిలదే అన్నారు. కలలను సాకారం చేసుకునే విధంగా సహకరించాలన్నారు. ఐసిడిఎస్ సూపర్వైజర్ సుశీల మాట్లాడుతూ జాతీయ పోషణ మాసం గురించి తెలియజేస్తూ మాంసపుకృతుల వలన కలిగే ఆరోగ్య పలితాలపై అవగాహన కల్పించారు. వ్యక్తిగత పరిశుభ్రత పరిసరాలు శుభ్రత కలిగి ఉండాలని సూచించారు. అలాగే మానసిక కౌన్సిలర్ డాక్టర్ రత్న కిషోర్ మాట్లాడుతూ శారీరకంగా మానసికంగా పరిపుష్టి కలిగి ఉండడం ద్వారా అత్యధిక విజయాలను సాధించవచ్చు అన్నారు. కేజీబీవీ ఎస్ ఓ స్వప్న కుమారి మాట్లాడుతూ యోగాభ్యాస వలన, ఏకాంత విద్య వలన, ఆధ్యాత్మిక చింత కలిగి ఉండడం ద్వారా మానసిక వైద్యులు చెప్పిన రీతిగా అభివృద్ధి చెందడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సోషల్ వర్కర్ ఓబులమ్మ తో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థినిలు, అంగన్వాడి టీచర్లు తదితరులు ఉన్నారు.

## గ్రామపంచాయతీ, అంగన్వాడి బిల్డింగ్స్ , స్కూల్ కాంపౌండ్ వాల్స్ పెండింగ్ పనులు పూర్తి చేయాలి

**- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్**




మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ ) వి బి జి రామ్ పనుల పురోగతి పై జిల్లా కలెక్టర్ కార్యాలయం లో వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ..వి బి జి రామ్ (వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్ ) కార్యక్రమంలో భాగంగా జిల్లాలో నూతనంగా జిల్లాలో నిర్మిస్తున్న గ్రామ పంచాయతీ భవనాలు 82, అంగన్వాడీ భవనాలు 55 , గోడౌన్ లు 8 ల పెండింగ్ పనులు పూర్తి చేసి అందుబాటులోకి తెచ్చేలా చర్యలు తీసుకోవాలని అధికారుల్ని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఈ ఈ పి ఆర్ నర్సింలు, డి ఆర్ డి వో శ్రీనివాస్ రావు, సంక్షేమ శాఖ అధికారి హేమ భార్గవి, జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య, సి డి పి ఓ లు,అధికారులు పాల్గొన్నారు.

## చీక్ మద్దూర్ గ్రామంలో స్మార్ట్ రేషన్ కార్డులు పంపించేసిన నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ యూత్ జనరల్ సెక్రెటరీ కృష్ణారెడ్డి



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ ) చిక్ మద్దూర్ గ్రామంలో గురువారం నాడు గ్రామపంచాయతీ కార్యాలయంలో మహిళలకు స్మార్ట్ కార్డులను పంపిణి చేసిన నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ యూత్ జనరల్ సెక్రెటరీ కృష్ణారెడ్డి ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా పాలనలో మహిళలకు అనేక కార్యక్రమాలు చేయాలని ప్రభుత్వం భావిస్తోందని వైఎస్ హయంలో పావుల వడ్డీ రుణాలు ప్రారంభించారనీ గుర్తు చేశారు.రూ 23వేల కోట్ల రూపాయలు మహిళలకు రుణాలు అందించామని,ఈవి వాహనాలను కూడా మహిళలకు అందిస్తున్నామన్నారు. మహిళలకు బస్సు ఫ్రీ సదుపాయం కల్పించింది రాష్ట్ర ప్రభుత్వం ,పేదలకు సన్నబియ్యం ఇస్తుందన్నారు.పేద పిల్లలకు స్కూల్స్ లలో సన్న బియ్యంతో మంచి భోజనం పెడుతున్నాం అని,సంక్షేమ హాస్టల్ల విద్యార్థులకు మంచి భోజనం పెడుతున్నామన్నారు.త్వరలో విద్యార్థులకు ఫ్రీ టిఫిన్ పెడుతున్నామని, ప్రతి సంక్షేమ పథకం పేదలకు ఉపయోగ పడాలన్నదే ప్రజా ప్రభుత్వం సంకల్పం అన్నారు.గత ఏడాది మూడు వేల ఇందిరమ్మ ఇల్లు ఇచ్చాం. ఈ ఏడాది మరో 2500ఇల్లు ఇస్తున్నాం అని తెలిపారు.ఏ ఊరిలో పెంకుటిల్లుకనిపించవద్దన్నారు.రాజీవ్ ఆరోగ్య శ్రీ ద్వారా రూ 10లక్షల వరకు వైద్యం అందిస్తున్నామని,విద్యా, వైద్యానికి ప్రభుత్వం మొదటి ప్రాధాన్యత ఇస్తుంది పేర్కొన్నారు.రూ 200కోట్ల రూపాయలతో ఇంటిగ్రెటెడ్ స్కూల్స్,పబ్లిక్ స్కూల్స్ తరహా లో తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ స్థాపిస్తున్నాం అని వివరించారు పేదలకు ఉచితంగా 200యూనిట్ల కరెంట్ వస్తున్నామని,స్మార్ట్ కార్డు ల లో ఫ్యామిలీ డిటైల్స్ ఉన్నాయి. దేశంలో ఎక్కడ అమలు చేయడం లేదన్నారు.గతంలో రేషన్ కార్డులలో అవకతవకలు జరుగుతుండే కానీ ఇప్పుడు ఆ పరిస్థితి ఉండదనీ స్పష్టం చేశారు. భూగర్భ గనుల శాఖ ద్వారా రూ 1000కోట్ల ఆదాయంతెచ్చామన్నారు.మహిళలకు 2500 ఇస్తామని మాట ఇచ్చామో ఇచ్చి తీరుతాం అని పునరుద్ఘాటించారు.తెలంగాణ లో ఆర్థిక పరిస్థితి బాగుచేసేందుకు సీఎం రేవంత్ కృషి చేస్తున్నారన్నా ని నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ యూత్ జనరల్ సెక్రెటరీ కృష్ణారెడ్డి తెలిపారు.

## ఊరికి ఒకే ఒక్కడు..

### - ప్రజాసేవలో లక్ష్మయ్య!



**కాల్వ శ్రీరాంపూర్ (ప్రశ్న న్యూస్)** పెద్దపల్లి జిల్లా కాల్వ శ్రీరాంపూర్ మండలం ఇప్పలపల్లి గ్రామపంచాయతీలో తోట లక్ష్మయ్య ఎన్నో ఏళ్లుగా గ్రామ పారిశుద్ధ్య కార్మికుడిగా సేవలందిస్తున్నారు. గ్రామంలో ప్రజలకు అవసరమైన అనేక పనులను బాధ్యతగా నిర్వహిస్తూ అందరి మన్ననలు పొందుతున్నారు.మురికి కాలువలు శుభ్రం చేయడం, రోడ్లను పరిశుభ్రంగా ఉంచడం, మంచినీటి సరఫరాలో సహకరించడం వంటి పనులతో పాటు గ్రామంలో ఏదైనా సమస్య తలెత్తినా వెంటనే స్పందిస్తూ తనవంతు సేవ చేస్తుంటారు. గ్రామంలో ముఖ్యమైన సమాచారం ప్రజలకు తెలియజేయాల్సి వచ్చినప్పుడు డప్పు చాటింపుతో ఇంటింటికీ సమాచారం చేరవేయడం కూడా ఆయన విధుల్లో ఒక భాగంగా మారింది. ప్రజలతో ఆప్యాయంగా, మంచిగా మెలుగుతూ ఎవరికి ఏ అవసరం వచ్చినా తనకు సాధ్యమైనంత వరకు సహాయం చేయడం లక్ష్మయ్య ప్రత్యేకత. గ్రామంలో పారిశుద్ధ్యం, తాగునీరు, ప్రజా సమాచారం వంటి కీలక అంశాల్లో నిరంతరం సేవలందిస్తున్న ఆయన "ఊరికి ఒకే ఒక్కడు"గా ప్రత్యేక గుర్తింపు పొందారు.

# కేటీఆర్, హరీష్‌లపై లైంగిక వేధింపుల కేసు

## మహిళా కానిస్టేబుల్ ఫిర్యాదుతో నమోదు!

- కేటీఆర్, హరీశ్‌రావు సహా పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలపై ఎఫ్ఐఆర్
- అసెంబ్లీ వద్ద చొక్కాలు విప్పి ఇబ్బంది పెట్టారని మహిళా కానిస్టేబుల్ ఫిర్యాదు
- భారతీయ న్యాయ సంహిత కింద కేసు నమోదు చేసిన సైఫాబాద్ పోలీసులు




**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ అసెంబ్లీ వద్ద బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, పోలీసుల మధ్య జరిగిన ఘర్షణకు సంబంధించి మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు సహా నలుగురు నేతలపై సైఫాబాద్ పోలీసులు కేసు నమోదు చేశారు. అసెంబ్లీ గేట్ నంబర్ 3 వద్ద విధులు నిర్వహిస్తున్న సమయంలో తమ పట్ల అనుచితంగా ప్రవర్తించారని.. దూషణలు, బెదిరింపులకు పాల్పడ్డారని ఆరోపిస్తూ ఓ మహిళా కానిస్టేబుల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ కేసు నమోదైంది. ఈ కేసులో కేటీఆర్, హరీశ్‌రావుతో పాటు బీఆర్ఎస్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డిలను నిందితులుగా చేర్చినట్లు పోలీసులు తెలిపారు. భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)లోని పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

తెలంగాణ అసెంబ్లీ వర్షాకాల సమావేశాల ప్రారంభం రోజున బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు బ్లాక్ టీ షర్టులు, ప్లకార్డులతో అసెంబ్లీ వద్దకు చేరుకుని ప్రభుత్వ తీరుకు నిరసన తెలిపారు. అయితే రూల్స్ ప్రకారం బ్లాక్ టీ షర్టులు, ప్లకార్డులతో అసెంబ్లీ ప్రాంగణంలోకి అనుమతి లేదని పోలీసులు అడ్డుకున్నారు. దీంతో బీఆర్ఎస్ నేతలు, పోలీసుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుని ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. కొందరు నేతలు పోలీసులను తోసుకుంటూ లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించారనే ఆరోపణలు వచ్చాయి. ఈ క్రమంలోనే విధుల్లో ఉన్న మహిళా పోలీసులతోనూ అనుచితంగా ప్రవర్తించారని తాజాగా ఫిర్యాదు నమోదైంది.ఓ మహిళా కానిస్టేబుల్ ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం విధి నిర్వహణలో ఉన్న మహిళా సిబ్బందిని బీఆర్ఎస్ నేతలు దూషించారని ఆరోపించారు. తమను అవమానించేలా మాట్లాడటంతో పాటు బెదిరింపులకు పాల్పడ్డారని ఫిర్యాదులో పేర్కొన్నట్లు సమాచారం. అలాగే కొందరు బీఆర్ఎస్ నాయకులు టీ షర్టులు విప్పేసి మహిళా పోలీసుల ఎదుట అర్ధనగ్నంగా నిలబడ్డారని దీంతో తమ విధులకు తీవ్ర ఆటంకం కలిగిందని ఆమె ఆరోపించినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనతో మహిళా పోలీసులకు ఇబ్బంది, మానసిక ఒత్తిడి ఏర్పడిందని ఫిర్యాదులో పేర్కొన్నట్లు సమాచారం.మహిళా కానిస్టేబుల్ ఫిర్యాదు ఆధారంగా కేటీఆర్, హరీశ్‌రావు, దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డిలపై పోలీసులు కేసు నమోదు చేశారు. మహిళల గౌరవానికి భంగం కలిగించడం, ప్రభుత్వ ఉద్యోగుల విధులకు ఆటంకం కలిగించడం, దాడి, బెదిరింపులు, అసభ్య ప్రవర్తన వంటి ఆరోపణలకు సంబంధించిన బీఎన్ఎస్ సెక్షన్లను ఎఫ్ఐఆర్‌లో చేర్చినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ వ్యవహారంలో బీఎన్ఎస్ 74, 75, 79, 121(1), 132, 296, 351(2), 352, 3(5) వంటి సెక్షన్లను పోలీసులు ప్రస్తావించినట్లు సమాచారం. అయితే ఎఫ్ఐఆర్‌లోని పూర్తి సెక్షన్ల వర్తింపు, దర్యాప్తు పురోగతిని బట్టి తదుపరి చర్యలు ఉండనున్నాయి.కేసు దర్యాప్తులో భాగంగా అసెంబ్లీ గేట్ నంబర్ 3 పరిసరాల్లోని సీసీటీవీ దృశ్యాలను పోలీసులు పరిశీలించనున్నట్లు తెలుస్తోంది. ం

ఘటనకు సంబంధించిన మీడియా వీడియోలు, ఫొటోలు, ఇతర ఆధారాలను కూడా సేకరించి ఆరోపణలపై విచారణ జరపనున్నారు. మహిళా పోలీసుల ఫిర్యాదులో పేర్కొన్న అంశాలను కూడా దర్యాప్తులో భాగంగా పోలీసులు పరిశీలించనున్నారు. ఆరోపణలు నిజమా ఘటనలో ఎవరెవరి పాత్ర ఉంది అన్న అంశాలను ఆధారాల ఆధారంగా నిర్ధారించాల్సి ఉంటుంది. అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య రాజకీయ పోరు తీవ్రంగా కొనసాగుతున్న సమయంలో ఈ కేసు నమోదు కావడం ప్రాధాన్యం సంతరించుకుంది. నల్ల దుస్తులతో బీఆర్ఎస్ నేతల నిరసన, అసెంబ్లీ గేటు వద్ద పోలీసులతో వాగ్వాదం, ఆ తర్వాత చోటుచేసుకున్న పరిణామాలు ఇప్పటికే తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి.

# మెడినోవా హాస్పిటల్ వైద్యుల అరుదైన చికిత్స

### - 58 ఏళ్ల మహిళలో 6.2 కిలోల భారీ అండాశయ కణితి విజయవంతంగా తొలగింపు







**మేడ్చల్ (ప్రశ్న న్యూస్ )** మెదక్ జిల్లాలోని గంధార పల్లికి చెందిన 58 ఏళ్ల మహిళ గత మూడు నెలలుగా కడుపు ఉబ్బరం, అజీర్ణంతో బాధపడుతూ మేడినోవా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వైద్యులను సంప్రదించారు. అనంతరం హాస్పిటల్ వైద్యులు నిర్వహించిన పరీక్షల్లో సదరు రోగి పొత్తికడుపులో సుమారు 32ఐ30 సెం.మీ. పరిమాణంలో అత్యంత భారీ అండాశయ కణితి ఉన్నట్లు గుర్తించారు. తదుపరి నిర్వహించిన పరీక్షలలో ఆ కణితి పొత్తికడుపు నుంచి పైభాగం వరకు విస్తరించి ఉండటంతో పాటు, పరిసర అవయవాలకు అంటుకుని ఉండటం ఈ కేసును అత్యంత క్లిష్టంగా మార్చిందని వైద్యులు గుర్తించారు.అదే సందర్భంలో ఈ కేసులో మరో ముఖ్యమైన సవాలు ఏమిటంటే, రోగికి గుండె సంబంధిత సమస్యలు కూడా ఉండడాన్ని గుర్తించారు. తర్వాత శస్త్రచికిత్సకు ముందు కార్డియాలజీ నిపుణులు నిర్వహిచిన పరీక్షల్లో మైల్డ్ డయాస్టాలిక్ డిస్‌ఫంక్షన్, మైల్డ్ పల్మనరీ హైపర్‌టెన్షన్ ఉన్నట్లు గుర్తించారు. దీంతో శస్త్రచికిత్సకు ముందు రోగి గుండె పరిస్థితిని పూర్తిగా అంచనా వేసి, అవసరమైన జాగ్రత్తలతో ముందుకు వెళ్లాల్సిన స్థితి ఉందని వైద్యులు అర్థం చేసుకొన్నారు.వీటన్నింటినీ పరిగణలోనికి తీసుకొని సంక్లిష్టమైన ఈ శస్త్ర చికిత్సను మెడినోవా హాస్పిటల్ కు చెందిన కన్సల్టెంట్ గైనకాలజిస్ట్ డా. సోనియా రెడ్డి, జనరల్ సర్జన్ డా. మనోజ్ కుమార్, అనస్థీషియా వైద్యులు డా. మాధవ్ రెడ్డి, డా. శిరీష ఇతర వైద్య బృందం సమన్వయంతో ఎక్స్‌ప్లోరేటరీ లాపరోటమీ నిర్వహించారు. శస్త్రచికిత్సలో సుమారు 6.2 కిలోల బరువున్న భారీ సీరస్ సిస్టాడెనోమా అనబడే కణితిని విజయవంతంగా తొలగించారు. కణితి గర్భాశయం, సిగ్మాయిడ్ కోలన్, రెక్టమ్ తదితర పరిసర నిర్మాణాలకు అంటుకుని ఉండటంతో అత్యంత జాగ్రత్తగా శస్త్రచికిత్స ను విజయవంతంగా పూర్తి చేశారు.ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ ఇంత భారీ పరిమాణంలో ఉన్న అండాశయ కణితితో పాటు గుండె సంబంధిత సమస్యలు ఉన్నప్పటికీ, నిపుణులైన గైనకాలజీ, జనరల్ సర్జరీ, కార్డియాలజీ మరియు అనస్థీషియా బృందాల సమన్వయంతో శస్త్రచికిత్సను విజయవంతంగా పూర్తి చేయగలిగామని వివరించారు. రోగి పూర్తిగా కోలుకొని ఆరోగ్యంతో ఇంటికి వెళ్లడం జరిగిందని అంటూ ఎలాంటి క్లిష్టమైన ఆరోగ్య సమస్యకైనా సరైన వైద్యులను సంప్రదిస్తే మంచి చికిత్స అందించవచ్చని సూచించారు.ఇబ్బందులన్నప్పటికీ జాగ్రత్తలు తీసుకొని చికిత్స అందించిన వైద్యులు రోగి మరియు ఆమె కుటుంభ సభ్యులు ధన్యవాదములు తెలిపారని పేర్కొన్నారు. మేడ్చల్ పట్టణంలో ఉన్న మెడినోవా హాస్పిటల్ లో అత్యాధునిక వైద్య చికిత్స అందుబాటులో ఉందని, ఈ సదుపాయాలను వినియోగించుకోవాలని యాజమాన్యం విజ్ఞప్తి చేసింది.

# ప్రజారోగ్యంతో చలగాటమాడుతున్న మెట్‌పల్లి శ్రీసూర్య హాస్పిటల్ రిజిష్ట్రేషన్ రద్దు

### - ఉత్తర్వులు జారీ చేసిన జిల్లా వైద్య అధికారి




**జగిత్యాల(ప్రశ్న న్యూస్)** జగిత్యాల జిల్లా వైద్య ఆరోగ్య అధికారి ఆదేశాల మేరకు, మెట్‌పల్లి డిప్యూటీ జిల్లా వైద్య ఆరోగ్య అధికారి 2026 సెప్టెంబర్ 2 న మెట్‌పల్లి పట్టణంలోని బోయవాడ (ఇంటి నం. 1-9-189, పిన్ కోడ్: 505326)లో ఉన్న 'శ్రీ సూర్య హాస్పిటల్'లో తనిఖీ నిర్వహించారు. ఈ తనిఖీలో పలు లోపాలు గుర్తించబడ్డాయి. దీనికి సంబంధించి, నిర్ణీత గడువులోగా వివరణ కోరుతూ ఆసుపత్రి యాజమాన్యానికి 2026 సెప్టెంబర్ 3 న 'షో-కాజ్ నోటీసు' (కారణం చూపమని కోరే నోటీసు) జారీ చేయబడింది. అయితే, నిర్ణీత గడువులోగా ఆసుపత్రి యాజమాన్యం నుండి ఎటువంటి వివరణ అందలేదని తెలిపారు. పైన పేర్కొన్న అంశాలు, తనిఖీలో గుర్తించిన లోపాలను పరిగణనలోకి తీసుకుని, మెట్‌పల్లిలోని 'శ్రీ సూర్య హాస్పిటల్' (రిజిస్ట్రేషన్ నం. 327/2025; చిరునామా: ఇంటి నం. 1-9-189, బోయవాడ, మెట్‌పల్లి పట్టణం, పిన్-505326) యొక్క ఆసుపత్రి రిజిస్ట్రేషన్‌ను తక్షణమే రద్దు చేస్తున్నట్లు ప్రకటించడమైనది. అంతేకాకుండా, సదరు ఆసుపత్రితో అనుసంధానించబడిన వైద్యులందరూ ఇకపై అక్కడ వైద్య సేవలు అందించకూడదని ఆదేశించడమైనది. అలాగే, ఆ ??ఆసుపత్రి నుండి తమ అనుబంధాన్ని (రిజిస్ట్రేషన్‌ను) తొలగించుకోవడానికి వ్యక్తిగత దరఖాస్తును తక్షణమే ఈ కార్యాలయానికి సమర్పించాలని సూచించడమైనది. రద్దు చేయబడిన రిజిస్ట్రేషన్‌తో ఆసుపత్రి కార్యకలాపాలను కొనసాగించవద్దని యాజమాన్యాన్ని ఆదేశించడమైనది. అలాగే, సదరు ఆసుపత్రిలో ప్రాక్టీస్ చేయడానికి నమోదైన వైద్యులు, ఈ ఉత్తర్వు అందిన 2 రోజులలోపు ఆసుపత్రి యొక్క అసలు రిజిస్ట్రేషన్ ధృవీకరణ పత్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్య కార్యాలయానికి అప్పగించాలని ఆదేశించడమైనదని తెలిపారు.ం



# పాతూర్ మార్కెట్ కూల్చొద్దు..

## ప్రత్యామ్నాయం చూపించండి

- రైతుల డిమాండ్‌కు బీఆర్ఎస్ నేత వంటేరు ప్రతాప్‌రెడ్డి మద్దతు
- ప్రత్యామ్నాయం లేకుండా మార్కెట్ తొలగిస్తే 500 మంది రైతులతో రాజీవ్ రహదారిపై ధర్నా



**గజ్వేల్ (ప్రశ్న న్యూస్ )** రాజీవ్ రహదారి పక్కనే ఉన్న పాతూర్ కూరగాయల మార్కెట్‌ను ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకుండా కూల్చివేయొద్దని పాతూర్ గ్రామ రైతులు అధికారులను కోరారు. మార్కెట్‌లో కూరగాయలు విక్రయించుకుంటూ సుమారు 300 రైతు కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయని, మార్కెట్‌ను తొలగిస్తే తమ ఉపాధి దెబ్బతింటుందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల ఆందోళనకు బీఆర్ఎస్ నేత, మాజీ ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి మద్దతు తెలిపారు.ఈ సందర్భంగా వంటేరు ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ.. గతంలో రాజీవ్ రహదారిపై కూరగాయలు, మొక్కజొన్న, పండ్లు విక్రయిస్తూ రైతులు జీవనం సాగించేవారని తెలిపారు. రహదారిపై జరిగిన ప్రమాదాల్లో పలువురు రైతులు మృతి చెందిన ఘటనలు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ విషయాన్ని అప్పటి తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లడంతో, ఆయన ఆదేశాల మేరకు అప్పటి మంత్రి హరీశ్‌రావు సుమారు రూ.1.50 కోట్లతో పాతూర్ మార్కెట్‌ను నిర్మించి రైతులకు అందుబాటులోకి తీసుకొచ్చారని తెలిపారు.మార్కెట్ అందుబాటులోకి వచ్చిన తర్వాత రైతులు రహదారిపై కాకుండా సురక్షితమైన ప్రదేశంలో కూరగాయలు విక్రయించుకుంటున్నారని, ప్రమాదాలు తగ్గి రైతులు సంతోషంగా ఉన్నారని అన్నారు. అవసరమైతే రైతులతో కలిసి 500 మందితో రాజీవ్ రహదారిపై ధర్నా, నిరసన కార్యక్రమం చేపడతామని స్పష్టం చేశారు.హరీశ్‌రావు ప్రతిష్టాత్మకంగా నిర్మించిన పాతూర్ మార్కెట్ విషయంలో రైతులు అధైర్యపడాల్సిన అవసరం లేదని, తాను ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంటూ రైతులకు అండగా నిలుస్తానని వంటేరు ప్రతాప్‌రెడ్డి భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ బాల్‌రెడ్డి, సీనియర్ నాయకులు నర్సింగరావు, లక్ష్మాపూర్ గ్రామ సర్పంచ్ స్వామి, పాతూర్ బీఆర్ఎస్ అధ్యక్షుడు మల్లేశం, పాతూర్ గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

## మేడ్చల్‌లో చాకలి ఐలమ్మ వర్ధంతి వేడుకలు



**మేడ్చల్( ప్రశ్న న్యూస్)** మేడ్చల్ లో చాకలి ఐలమ్మ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా సీపీఎం పార్టీ మేడ్చల్ మండల కమిటీ ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు ఈ సందర్భంగా సీపీఎం పార్టీ మేడ్చల్ మండల కార్యదర్శి నరేష్ మాట్లాడుతూ చాకలి ఐలమ్మ తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో అలుపెరగని పోరాటం చేసిన గొప్ప నాయకురాలని అన్నారు.

తెలంగాణ సాయుధ పోరాటంలో దొరలకు వ్యతిరేకంగా, తానుపండించిన పంటను తన ఇంటికి తీసుకెళ్లడం కోసం అనేక రకాల పోరాటాలు చేయడం జరిగిందనితెలిపారు. తన భూమిని, అలాగే ధాన్యాన్ని రక్షించుకోవడం కోసం దొరలకు వ్యతిరేకంగా,రజాకార్లకు వ్యతిరేకంగా, పోలీసు సైన్యానికి వ్యతిరేకంగా సంఘం తోని కలిసి పోరాటం చేసినటువంటి ఒక గొప్ప నాయకురాలు చాకలి ఐలమ్మ అని కొనియాడారు.చాకలి ఐలమ్మ పోరాట వారసత్వాన్ని తీసుకొని, ఇప్పుడున్న పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం అనేక రకాలుగా ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తూ పేదలకు చేస్తున్న అన్యాయాలపైన ప్రజలను ఐక్యమత్యం చేసి పోరాటం చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు.తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం అనేది దొరలకు వ్యతిరేకంగా, జాగీర్దారులకువ్యతిరేకంగా, నిజాం సర్కారుకు వ్యతిరేకంగా జరిగినటువంటి పోరాటమని తెలిపారు.ఇప్పుడున్న చాలా మంది నాయకులు, ముఖ్యంగా బీజేపీకి సంబంధించిన వారు, ఈ పోరాటాన్ని హిందూ-ముస్లిం కొట్లాటలుగా చిత్రీకరించడానికి ప్రయత్నం చేస్తున్నారని, ఇది సరైన పద్ధతి కాదని తెలియజేశారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం ప్రధానంగా భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరీ విముక్తి కోసం జరిగిన పోరాటమని ప్రజలందరూ గుర్తుంచుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పార్టీ మేడ్చల్ మండల కమిటీ సభ్యులు రమేష్, కొమురయ్య, నాయకులు ఎన్ కృష్ణ, శ్రీను , బాలు ,వినయ్, నర్సింగ్ రావ్ తదితరులు పాల్గొన్నారు.

## మేడ్చల్ ఎన్ ఎస్ యు ఐ జిల్లా అధ్యక్షుడిగా రాకేష్ ముదిరాజ్



**మేడ్చల్( ప్రశ్న న్యూస్ )** ఎన్ ఎస్ యు ఐ మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడిగా రాకేష్ ముదిరాజ్ నియామకం అయ్యారు. విద్యార్థుల హక్కులు, సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతున్న రాకేష్ ముదిరాజ్‌ను ఎన్ ఎస్ యు ఐ మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడిగా నియమించారు.ఈ సందర్భంగా రాకేష్ ముదిరాజ్ మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన ఎన్ ఎస్ యు ఐ జాతీయ అధ్యక్షులు వినోద్ కు గారికి, తెలంగాణ ఎన్ ఎస్ యు ఐ రాష్ట్ర అధ్యక్షులు వెంకటస్వామి, జాతీయ లీగల్ సెల్ కన్వీనర్ అక్బర్ కృతజ్ఞతలు తెలిపారు. అలాగే తన నియామకానికి సహకరించిన రాజ్యసభ ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ, మేడ్చల్--మల్కాజిగిరి జిల్లాలో ఎన్ ఎస్ యు ఐ ని మరింత బలోపేతం చేస్తానని రాకేష్ ముదిరాజ్ తెలిపారు.

## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

- జిల్లా వైద్య శాఖ అధికారి డా. ఆనంద్



**మేడ్చల్( ప్రశ్న న్యూస్ )** మేడ్చల్--మల్కాజ్‌గిరి జిల్లా జిల్లా వైద్య మరియు ఆరోగ్య అధికారి డా. కె. ఆనంద్ హస్మత్‌పేట్‌లోని మండల పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థుల ఆరోగ్యం, పోషణ, పారిశుద్ధ్య పరిస్థితులను పరిశీలించారు.ఈ సందర్భంగా పాఠశాలలోని ఆహార నిల్వల స్టాక్ రిజిస్టర్‌ను తనిఖీ చేసి, కూరగాయల నాణ్యతను పరిశీలించారు. అనంతరం వంటశాలను సందర్శించి వంట సమయంలో ఆహారం నాణ్యత, పరిశుభ్రత, వంటగది నిర్వహణను స్వయంగా పరిశీలించారు.పాఠశాల పరిసరాల్లో పారిశుద్ధ్య పరిస్థితులను పరిశీలించిన డా. కె. ఆనంద్, మరుగుదొడ్లు సరైన స్థితిలో లేకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. మరుగుదొడ్లను నిరంతరం శుభ్రంగా, పరిశుభ్రంగా ఉంచాలని, అపరిశుభ్రత కారణంగా విద్యార్థుల్లో వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉన్నందున ప్రత్యేక శ్రద్ధ వహించాలని సంబంధిత ప్రధానోపాధ్యాయుడికి సూచించారు.అనంతరం పాఠశాలలో నిర్వహిస్తున్న వైద్య శిబిరాన్ని డీఎంహెచ్ఓ పరిశీలించారు. ఆర్‌బీఎస్‌కే బృందాలు పాఠశాలలో నిర్వహిస్తున్న వైద్య పరీక్షలకు సంబంధించిన రికార్డులను తనిఖీ చేసి, విద్యార్థుల ఆరోగ్య వివరాలను పరిశీలించారు. అలాగే ఎస్ ఏ ఎం - ఎం ఏ ఎం పిల్లలను గుర్తించడం, వారి వివరాల నమోదు, ఆరోగ్య పరిస్థితిపై తీసుకుంటున్న చర్యల గురించి ఆరా తీశారు.విద్యార్థుల ఆరోగ్యం, పోషణ, వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పాఠశాల పరిసరాల పారిశుద్ధ్యంపై విద్యార్థులకు తరగతి గదిలోనే అవగాహన కల్పించారు. ఆరోగ్యకరమైన అలవాట్లు పాటించడం, చేతులు శుభ్రంగా కడుక్కోవడం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ద్వారా వ్యాధులను నివారించవచ్చని విద్యార్థులకు వివరించారు.విద్యార్థుల ఆరోగ్యం విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా, పాఠశాలలో పరిశుభ్రమైన మరియు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని నిరంతరం కొనసాగించాలని డా. కె. ఆనంద్ సంబంధిత పాఠశాల సిబ్బందికి సూచించారు.

## ఈ నెల 30లోగా రేషన్ కార్డుల లబ్ధిదారులు ఈ - కేవైసీ చేసుకోవాలి

- మేడ్చల్ తహసిల్దార్ భూపాల్



**మేడ్చల్ (ప్రశ్న న్యూస్ )** పౌరసపరాల శాఖ కమిషనర్ ఆదేశాల మరకు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో రేషన్ కార్డు లబ్దిదారులు ఈనెల 30లోగా ఈ - కేవైసీ నమోదు చేసుకోవాలని మేడ్చల్ తహసిల్దార్ భూపాల్ కోరారు. ఇందులో భాగంగా ఇప్పటివరకు మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లాలో మొత్తం 22,62,797 మంది రేషన్ కార్డు సభ్యులు ఉండగా, ఇప్పటివరకు 17,55,183 మంది సభ్యులు ఈ - కేవైసీ ప్రక్రియను పూర్తి చేశారని ఇంకా 5,07,614 మంది సభ్యులు ఈ - కేవైసీ పూర్తి చేయవలసి ఉంది అని తెలిపారు ఈ విషయమై గతంలో కూడా పలుమార్లు రేషన్ కార్డు లబ్దిదారులకు విస్తృతంగా అవగాహన కల్పించబడినప్పటికీ, ఇంకా కొంతమంది సభ్యులు ఈ -కే వై సి నమోదు పూర్తి చేయలేదని , ఈ -కే వై సి పూర్తి చేయని 5,07,614 మంది రేషన్ కార్డు లబ్దిదారులు తమకు అందుబాటులో ఉన్న రేషన్ షాప్ ను సందర్శించి, ఎటువంటి జాప్యం లేకుండా ఈనెల 30లోగా ఈ - కేవైసీ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని తెలిపారు.. అందరు డీలర్లు రేషన్ దుకాణాలను తిరిచి ఉంచి, ఈ - కేవైసీ పూర్తి చేసుకోవడానికి వచ్చే కార్డుదారులకు అవసరమైన సహకారం అందించాలని కోరారు.

## ఆశాల ఛలో హైదరాబాద్‌ను జయప్రదం చేయండి

- బీఆర్‌టీయూ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు సంబు ప్రభాకర్




**మేడ్చల్( ప్రశ్న న్యూస్ )** ఆశా వర్కర్ల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 11న నిర్వహించనున్న ఛలో హైదరాబాద్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని బీఆర్‌టీయూ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు సంబు ప్రభాకర్ పిలుపునిచ్చారు. ఆశా వర్కర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించి, వారికి న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.ఆశా వర్కర్లకు నెలకు రూ.18 వేల ఫిక్స్‌డ్ వేతనం చెల్లించాలని, ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. అలాగే ఆశా వర్కర్లపై విధిస్తున్న ఏఎన్‌సీ టార్గెట్లను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.ఖాళీగా ఉన్న ఆశా వర్కర్ పోస్టులను వెంటనే భర్తీ చేయడంతో పాటు, ఆశా వర్కర్లపై అదనపు పనిభారం పెంచుతున్న బీఎల్‌ఓ డ్యూటీల నుంచి మినహాయింపు కల్పించాలని సంబు ప్రభాకర్ కోరారు. ప్రభుత్వ ఉద్యోగులు, ఇతర వర్గాలకు అందుతున్న సంక్షేమ పథకాలను ఆశా వర్కర్లకు కూడా వర్తింపజేయాలని అన్నారు.

### ఆశాల ప్రధాన డిమాండ్లు

ఆశా వర్కర్లకు రూ.18 వేల ఫిక్స్‌డ్ వేతనం ఇవ్వాలి. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు ఉద్యోగ భద్రత కల్పించాలి. ఏఎన్‌సీ టార్గెట్లను వెంటనే ఎత్తివేయాలి. ఖాళీగా ఉన్న ఆశా పోస్టులను తక్షణమే భర్తీ చేయాలి.ఆశా వర్కర్లను బీఎల్‌ఓ డ్యూటీల నుంచి మినహాయించాలి. ఆశా వర్కర్లకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలి. ఆశా వర్కర్ల సమస్యలపై ప్రభుత్వం తక్షణమే చర్చించి పరిష్కారం చూపాలి. ఆశా వర్కర్లు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రజారోగ్య సేవల్లో కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ, తమ సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం ఇకనైనా స్పందించి ఆశా వర్కర్ల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని సంబు ప్రభాకర్ కోరారు. ఈ నేపథ్యంలో ఈ నెల 11న చేపట్టనున్న ఛలో హైదరాబాద్ కార్యక్రమానికి ఆశా వర్కర్లు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

# మనోధైర్యంతో ముందుకు సాగాలి

- ఆత్మహత్యల నివారణ దినం పోస్టర్ ఆవిష్కరణలో కలెక్టర్ గరిమ అగ్రవాల్



**సిరిసిల్ల (ప్రశ్న న్యూస్)** ఆత్మహత్యల నివారణ దినం సందర్భంగా జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో టోల్ ఫ్రీ నెంబర్ 14416పోస్టర్లు కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితె, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, డీఎంహెచ్ఓ ఏంజెలా ఆల్ఫ్రెడ్ తో కలిసి గురువారం ఆవిష్కరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ర్యాలీలు నిర్వహించి ఆత్మ హత్యల నివారణ గురించి అవగాహన కల్పించాలని, యువత, విద్యార్థులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు.మానసిక సమస్యలకు చికిత్స తీసుకునే కంటే వీటిని దాచి పెట్టేందుకు చాలా మంది ప్రయత్నిస్తారని, ఈ సమస్యపై మాట్లాడేందుకు చాలా మంది ఇష్టపడరని వివరించారు.జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రుల్లో మానసిక కేంద్రాలు అందుబాటులో ఉన్నాయని, చికిత్స పూర్తిగా ఉచితముగా అందిస్తామని, వారియొక్క వివరాలు గోప్యముగా ఉంటాయని స్పష్టం చేశారు. ఆత్మహత్యలను అడ్డుకోవడంలో టెలీమానాస్ (టోల్ ఫ్రీ నెంబర్ 14416) 24 గంటలు సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ సేవలను ప్రజలు వియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. వైద్యుల సూచన మేరకు సూచించిన మోతాదులో మందులు వాడితే ఆత్మ హత్యలు నివారించ బడుతాయని అన్నారు, సమాజం, చుట్టూ ప్రక్కల వారు ఆత్మ న్యూనత భావనతో ఉన్న వారికి చేయూత ఇవ్వాలని, అవగాహనతో మెలగాలని అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ నయీమా జహా, వివిధ శాఖల అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పాత్రికేయుల ఐక్యతకు నూతన ప్రెస్ క్లబ్ ఏర్పాటు

- ఎల్లారెడ్డిపేట ప్రెస్ క్లబ్ అడ్‌హాక్ కమిటీ ఎన్నిక
- జర్నలిస్టుల సంక్షేమం.. హక్కుల పరిరక్షణ.. ప్రజా సమస్యలే ప్రధాన ఎజెండా



**ఎల్లారెడ్డిపే(ప్రశ్న న్యూస్)** పాత్రికేయుల ఐక్యతకు కొత్త బాట పడింది. జర్నలిస్టుల సంక్షేమం, హక్కుల పరిరక్షణతో పాటు ప్రజా సమస్యలను మరింత బలంగా ప్రభుత్వం, అధికారుల దృష్టికి తీసుకెళ్లే లక్ష్యంతో ఎల్లారెడ్డిపేట ప్రెస్ క్లబ్ నూతన అడ్‌హాక్ కమిటీని గురువారం ఏర్పాటు చేశారు.పాత్రికేయులంతా ఐక్యంగా ఉంటేనే వృత్తిపరమైన సమస్యలను సమర్థవంతంగా పరిష్కరించుకోవచ్చని కమిటీ సభ్యులు తెలియజేశారు. ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకురావడం, అన్యాయాలను ప్రశ్నించడం, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడం వంటి బాధ్యతలను మీడియా సమర్థవంతంగా నిర్వర్తించాల్సిన అవసరం ఉందన్నారు.జర్నలిస్టుల సంక్షేమానికి సంబంధించిన సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, జర్నలిస్టులకు అందాల్సిన సౌకర్యాలపై అవగాహన కల్పించేందుకు కృషి చేస్తామని తెలిపారు. వృత్తిపరమైన ఇబ్బందులు, ఒత్తిళ్లు, గుర్తింపు, భద్రత తదితర అంశాల్లో అవసరమైన సమయంలో పాత్రికేయులకు అండగా నిలుస్తామని స్పష్టం చేశారు.

### ప్రతి జర్నలిస్టుకు అండగా..

ప్రెస్ క్లబ్‌ను కేవలం సమావేశాలకే పరిమితం చేయకుండా ప్రతి పాత్రికేయుడికి అండగా నిలిచే వేదికగా తీర్చిదిద్దాలని నిర్ణయించారు. జర్నలిస్టుల మధ్య సోదరభావం, పరస్పర సహకారం పెంపొందించడంతో పాటు వృత్తిపరమైన నైపుణ్యాల అభివృద్ధికి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.ప్రజా సమస్యల పరిష్కారంలో మీడియా పాత్రను మరింత బలోపేతం చేస్తూ, వాస్తవాలను నిర్భయంగా వెలుగులోకి తీసుకురావడమే లక్ష్యంగా ముందుకు సాగుతామని కమిటీ సభ్యులు తెలిపారు.నూతన కార్యవర్గం కమిటీలో
గౌరవ అధ్యక్షులు: బండారి బాల్ రెడ్డి, కాసు శ్రీనివాసరాజు,అధ్యక్షుడుగా బుగ్గ కృష్ణమూర్తి శర్మ, ఉపాధ్యక్షులుగా కులేరి కిషోర్ కుమార్, దుర్గం విజయ్ బాబు, పెంటం శ్రీనివాస్,ప్రధాన కార్యదర్శిగాఒగ్గు బాలరాజు యాదవ్,కార్యదర్శులుగా ఎం డి.లతీఫ్, మిట్టలక్ష్మి లక్ష్మీనారాయణ,సంయుక్త కార్యదర్శులుగా కులేరి దీప్తి కుమార్, జగదీష్ లు,కోశాధికారిగా శ్రీరామోజు శేఖర్,గౌరవ సలహాదారులుగా ఎదురుగట్ల ముత్తయ్య, సిహెచ్ తిరుపతి గౌడ్, శ్రీరామోజు ప్రవీణ్, సురేష్ యాదవ్, కందుకూరి రవి లు,కార్యవర్గ సభ్యులుగా యమగొండ పద్మా రెడ్డి, మహమ్మద్ షరీఫ్, చేపూరి నాగరాజ్, బత్తిని శ్రీధర్ గౌడ్, చింతకింది శ్రీనివాస్ గౌడ్ ఒగ్గు మహేష్ చంద్రలు ఎన్నికయ్యారు.

## భాధ్యతలు చేపట్టిన శ్రీసాయిబాలాజీ హోమ్స్ పేస్ 2 నూతన కార్యవర్గం



**బడంగ్ పేట్ (ప్రశ్న న్యూస్)** జీహెచ్ఎంసీ బడంగ్ పేట్ సర్కిల్ పరిధిలోని శ్రీసాయిబాలాజీ హోమ్స్ పేస్ - 2 రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు బాధ్యతలను చేపట్టారు. గత ఆదివారం నాడు జరిగిన రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నికల్లో భారీ మెజారిటీతో గెలుపొందిన రాందాస్ నాయక్ ప్యానెల్ ఘనవిజయం సాధించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో బుధవారం నాడు కాలనీ కమ్యూనిటీ హాల్ లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో కాలనీవాసుల సమక్షంలో నూతన కార్యవర్గ సభ్యులు బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా వెల్ఫేర్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడు రాందాస్ నాయక్ మాట్లాడుతు తమ ప్యానెల్ పై నమ్మకముంచి ఆదరించిన కాలనీవాలకు కృతజ్ఞతలు తెలిపుచు, సుహృద్భావ వాతావరణంలో నిర్విరామంగా పని చేస్తు కాలనీ అభివృద్ధి కోసం పాటుపడుతు సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనిచ్చి కాలనీలో ప్రశాంత వాతావరణాన్ని నెలకొల్పేందుకు తమ ప్యానెల్ సభ్యులు ఎల్లవేళలా సిద్ధంగా ఉంటారని తెలిపారు. ఉపాధ్యక్షులుగా భాధ్యతలు చేపట్టిన శ్రీరామచంద్రమూర్తి మాట్లాడుతు తమ ప్యానెల్ విజయం కాలనీవాసుల విజయమని, తమ ప్యానెల్‌కు భారీ విజయాన్ని అందించిన సహచర కాలనీవాసులకు ధన్యవాదాలు తెలుపుచు, ఎల్లవేళలా అందుబాటులో ఉంటు సమస్యల సాధనలో నిరంతరం శ్రమిస్తామని, కాలనీవాసులు నూతన కమిటీ సభ్యులకు తమ సహకారం అందించి కాలనీ అభివృద్ధిలో భాగస్వాములు అయ్యేలా సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాల్గోన్న కాలనీ వాసులు నూతన కార్యవర్గం సభ్యులను అభినందించారు.

## జలసిరి కుంటల్లో గంగపుత్రులకు చేపల పెంపక అవకాశం కల్పించాలి

- ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్‌కు వినతి పత్రం అందజేసిన టిజిఎస్ రాష్ట కార్యదర్శి టుంగుటూరి రాజేష్ ఖన్నా గంగపుత్ర



**హైదరాబాద్(ప్రశ్న న్యూస్)** రాష్ట వ్యాప్తంగా జలసిరి పథకం కింద నిర్మించనున్న 50 వేల నీటి కుంటల్లో సంప్రదాయ మత్స్యకారులైన గంగపుత్రులకు చేపల పెంపకానికి అవకాశం కల్పించాలని తెలంగాణ గంగపుత్ర సంఘం రాష్ట కార్యదర్శి టుంగుటూరి రాజేష్ ఖన్నా గంగపుత్ర రాష్ట ప్రభుత్వాన్ని కోరారు.ప్రజల పాలనలో భాగంగా నిర్వహిస్తున్న ప్రజలతో ముఖాముఖి కార్యక్రమంలో తెలంగాణ రాష్ట ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్‌కు కలిసి వినతి పత్రం అందజేశారు తరతరాలుగా చేపల వేట చేపల విక్రయాన్నే నమ్ముకుని జీవిస్తున్న గంగపుత్రుల కుటుంబాలకు జలసిరి పథకం ద్వారా స్థిరమైన ఉపాధి కల్పించాల్సిన అవసరం ఉందని ఆయన వివరించారు.50 వేల నీటి కుంటల్లో చేపల పెంపకానికి గంగపుత్రులకు ప్రాధాన్యత కల్పిస్తే వేలాది మత్స్యకార కుటుంబాలకు ఉపాధి లభించడంతో పాటు వారి ఆదాయం పెరిగి జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని రాజేష్ ఖన్నా తెలిపారు ఈ విషయంపై సంబంధిత శాఖ ఉన్నతాధికారులకు తగిన ఆదేశాలు జారీ చేసి గంగపుత్రులకు న్యాయం చేయాలని ప్రభుత్వ సలహాదారును కోరారు.సంప్రదాయ మత్స్యకారుల జీవనోపాధిని కాపాడుతూ జలసిరి పథకాన్ని గంగపుత్రుల ఆర్థిక అభివృద్ధికి కూడా ఉపయోగపడేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# తార్నాకలో విషాదం..

## అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

**- భర్త రైల్వే ట్రాక్‌పై మృతి, ఆత్మహత్యగా అనుమానం**



**తార్నాక(ప్రశ్న న్యూస్)** లాలాగూడ పోలీస్ స్టేషన్ పరిధిలోని విజయపురి కాలనీలో ఓ మహిళ అనుమానాస్పద పరిస్థితుల్లో మృతి చెందిన ఘటన కలకలం రేపింది. పోలీసుల వివరాల ప్రకారం విజయపురి కాలనీ, తార్నాకకు చెందిన లక్ష్మి (24), భర్త శరణప్పతో కలిసి నివాసం ఉంటోంది. గురువారం ఆమె ఇంట్లో అనుమానాస్పద స్థితిలో మృతి చెంది కనిపించింది.సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని గాంధీ ఆసుపత్రికి తరలించారు. మృతికి అసలు కారణం ఏమిటన్నది నిర్ధారించేందుకు పోస్టుమార్టం నిర్వహిస్తున్నామని తెలిపారు.ఇదిలా ఉండగా లక్ష్మి భర్త శరణప్ప ఉదయం సమయంలో రైల్వే ట్రాక్‌పై రైలును ఢీకొని మృతి చెందినట్లు సమాచారం. ఈ ఘటనపై రైల్వే పోలీసులు (జి ఆర్ పి) కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.లక్ష్మి మృతిపై ఆమె తల్లిదండ్రులు, బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసే ప్రక్రియ చేపట్టారు. ఘటనకు సంబంధించిన అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగిస్తున్నారు.ప్రాథమిక దర్యాప్తులో ఆత్మహత్య జరిగి ఉండవచ్చనే అనుమానం వ్యక్తమవుతున్నప్పటికీ, లక్ష్మి మృతికి ఖచ్చితమైన కారణం పోస్టుమార్టం నివేదికతో పాటు పోలీసుల సమగ్ర దర్యాప్తు అనంతరం తేలనుంది. భార్యాభర్తలిద్దరూ కొద్దిసమయంలోనే మృతి చెందడం స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది

# తిరుపతిలో బెస్తలకు రాజకీయ అవకాశాలు కల్పించాలి

**- అఖిల భారత గంగపుత్ర మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు పిజి. వెంకటేష్ బెస్త విజ్ఞప్తి**




**తిరుపతి (ప్రశ్న న్యూస్)**(ఏపీలోని తిరుపతిలో త్వరలో జరుగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో జిల్లా పరిషత్ చైర్మన్, మేయర్, మున్సిపల్ చైర్మన్, ఎంపిపి పదవులతో పాటు పార్టీ పదవుల్లో, నామినేటెడ్ పదవుల్లో బెస్త కులానికి తగిన ప్రాధాన్యత ఇవ్వాలని అఖిల భారత గంగపుత్ర బెస్త మహాసభ రాష్ట్ర అధ్యక్షులు పిజి. వెంకటేష్, తెలుగుదేశం పార్టీ బెస్త సాధికార కమిటి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి. భక్తవత్సలం కూటమి ప్రభుత్వాన్ని కోరారు. గురువారం నాడు తిరుపతి పట్టణంలోని ప్రెస్ క్లబ్ లో అఖిల భారత బెస్త మహాసభ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించడం జరిగింది.

**- ఓటు బ్యాంకు రాజకీయాలపై మనోవేదన**

రాష్ట్రములో దాదాపు 18 లక్షల జనాభా కలిగిన బెస్తలను మొదటి నుండి కూడా ఓటు బ్యాంకుగా చూస్తున్నారు తప్ప వారికి రాజకీయంగా ప్రోత్సాహం లేదని వెంకటేష్ వాపోయారు.ఈ దేశానికి స్వాతంత్రం సిద్ధించి ఎనిమిది దశాబ్దాలు దాటుతున్నా ఇంతవరకు చట్టసభల్లో తమ కులం అడుగుపెట్టలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

**- కూటమి ప్రభుత్వ ఏర్పాటులో బెస్తలది కీలక పాత్ర :**

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడానికి రాష్ట్రంలోని బెస్తలను ఒకే తాటిపైకి తీసుకువచ్చి కూటమి ప్రభుత్వ ఏర్పాటులో బెస్తలది చాలా కీలకపాత్ర అని వారు తెలిపారు. చట్ట సభల్లో పోటీ చేసి గెలిచే స్థాయి లేనందున బెస్తలకు కనీసం నామినేటెడ్ పదవుల్లో మరియు పార్టీ పదవుల్లో అయినా న్యాయం చేయాలన్నారు. దశాబ్దాల కాలంగా రాజకీయంగా అణిచివేతకు గురయ్యామని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

**- బీసీ కులాల్లోనే అనేక అసమానతలు**

రాష్ట్రంలో బీసీ కులాలలో 139 ఉప కులాలు ఉన్నాయని, ఆ కులాలలో మూడు నాలుగు కులాలు మాత్రమే రాజకీయంగా అభివృద్ధి చెందుతున్నాయని, ఆ రెండు మూడు కులాలకే పార్టీలు కూడా అవకాశాలు కల్పిస్తున్నాయని వారు విమర్శించారు.

**- స్థానిక సంస్థల్లో ఏబీసీడీ వర్గీకరణ ఒక్కటే పరిష్కారం**

బీసీలకు విద్య, ఉద్యోగాల్లో కల్పిస్తున్న విధంగానే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా ఏబీసీడీ వర్గీకరణ చేయాలని, ఈ విధంగా వర్గీకరణ చేయడం ద్వారానే రాజకీయంగా ఉనికి లేని కులాలకు న్యాయం జరుగుతుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో గంగపుత్ర మహాసభ ప్రతినిధులు బెస్త గిరి, జానకి రామయ్య బెస్త, కళ్యాణ్ చక్రవర్తి బెస్త తదితరులు పాల్గొన్నారు.

# సుప్రీంకోర్టులో ఇంటర్న్‌షిప్ చేసిన నవీన్ ఎలగందుల



**గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ )** వర్గల్ మండలం నెంటూర్ గ్రామానికి చెందిన ఎలగందుల నవీన్ దేశ అత్యున్నత న్యాయస్థానమైన సుప్రీంకోర్టులో ఇంటర్న్‌షిప్ చేసే అవకాశం పొందారు. కేవీఆర్ఆర్ న్యాయ కళాశాలలో న్యాయ విద్యను అభ్యసిస్తున్న నవీన్.. న్యాయ విద్యలో భాగంగా సుప్రీంకోర్టులో ఇంటర్న్‌షిప్ పూర్తి చేశారు.ఈ సందర్భంగా సుప్రీంకోర్టులో జరిగే న్యాయపరమైన కార్యకలాపాలు, కోర్టు విచారణలు, న్యాయ పరిశోధన తదితర అంశాలను ప్రత్యక్షంగా పరిశీలించారు. సుప్రీంకోర్టులో ఇంటర్న్‌షిప్ చేయడం తనకు ఎంతో విలువైన అనుభవమని నవీన్ తెలిపారు. ఈ అనుభవం భవిష్యత్తులో న్యాయ రంగంలో ఉన్నత స్థాయికి ఎదగడానికి ఎంతగానో దోహదపడుతుందని పేర్కొన్నారు.నవీన్ సుప్రీంకోర్టులో ఇంటర్న్‌షిప్ చేయడంపై తల్లిదండ్రులు ఎలగందుల శ్రీనివాస్, స్వరూప హర్షం వ్యక్తం చేశారు. నెంటూర్ గ్రామానికి చెందిన నవీన్‌కు ఈ అవకాశం లభించడం పట్ల గ్రామస్థులు అభినందనలు తెలిపారు. అలాగే కేవీఆర్ఆర్ న్యాయ కళాశాల అధ్యాపకులు, సహ విద్యార్థులు నవీన్‌ను అభినందించారు.

# మరోసారి బట్టబయలైన సీఎంఆర్ ఎఫ్ చెక్కుల దందా

**- తెలంగాణ సచివాలయంలో ఏసీబీ దాడులు**

**- రూ.2 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కుకు రూ.లక్ష లంచం**



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ సచివాలయంలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు చేపట్టిన ట్రాప్ కలకలం రేపింది. ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) కింద మంజూరైన రూ.2 లక్షల మెడికల్ రీయింబర్స్‌మెంట్ చెక్కును ఇప్పించేందుకు రూ.లక్ష లంచం డిమాండ్ చేసినట్లు అందిన ఫిర్యాదు ఆధారంగా ఏసీబీ అధికారులు రంగంలోకి దిగారు. సచివాలయ ఆవరణలోని దేవాలయం సమీపంలో లంచం తీసుకుంటుండగా ఓ ఉద్యోగిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నట్లు తెలుస్తోంది. ఈ లంచం తీసుకోవడంలో మరో ఉద్యోగి హస్తం కూడా ఉన్నట్లు గుర్తించిన ఏసీబీ అధికారులు.. వారిద్దరినీ అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు. వారిద్దరినీ నాంపల్లిలోని ఏసీబీ కార్యాలయానికి తరలించి విచారిస్తున్నారు.సీఎంఆర్ఎఫ్ కింద మంజూరైన రూ.2 లక్షల ఆర్థిక సాయానికి సంబంధించిన చెక్కు కోసం బాధితుడు సంబంధిత ఉద్యోగులను సంప్రదించినట్లు తెలుస్తోంది. ఈ సమయంలో చెక్కును అందించేందుకు రూ.లక్ష లంచం డిమాండ్ చేసినట్లు ఏసీబీకి ఫిర్యాదు అందింది. బాధితుడి ఫిర్యాదును స్వీకరించిన ఏసీబీ అధికారులు పక్కా ప్రణాళికతో ట్రాప్ నిర్వహించినట్లు సమాచారం. ఇందులో భాగంగా సచివాలయ ఆవరణలోని దేవాలయం వద్ద బాధితుడి నుంచి లంచం తీసుకుంటున్న సమయంలో ఉద్యోగిని అధికారులు పట్టుకున్నట్లు తెలుస్తోంది. ఈ కేసులో సచివాలయంలోని సీఎంఆర్ఎఫ్ విభాగానికి సంబంధించిన సెక్షన్ ఆఫీసర్ వినోద్‌తో పాటు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి రాఘవేంద్రను ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఈ వ్యవహారంలో మొదటి విడతగా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి రాఘవేంద్ర రూ.5 వేల నగదు తీసుకున్నట్లు తెలుస్తోంది. ఆ తర్వాత మిగిలిన మొత్తంలో భాగంగా రూ.లక్ష తీసుకునే సమయంలో సీనియర్ అసిస్టెంట్/సెక్షన్ ఆఫీసర్ స్థాయి ఉద్యోగి ఏసీబీ ట్రాప్‌లో చిక్కినట్లు తెలుస్తోంది. ఈ లంచం వ్యవహారంలో ఎవరి ఆదేశాల మేరకు డబ్బులు డిమాండ్ చేశారు, ఇంకా ఎవరైనా ఉద్యోగులు, అధికారులు ఇందులో భాగస్వాములుగా ఉన్నారా అనే కోణాల్లో ఏసీబీ అధికారులు దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం.ట్రాప్ తర్వాత ఏసీబీ అధికారులు సీఎంఆర్ఎఫ్‌కు సంబంధించిన విభాగంలో సోదాలు నిర్వహించినట్లు తెలుస్తోంది. బాధితుడి దరఖాస్తు, సీఎంఆర్ఎఫ్ మంజూరు ప్రక్రియ, చెక్కు విడుదలకు సంబంధించిన ఫైళ్లు, ఉద్యోగుల పాత్రపై వివరాలు సేకరిస్తున్నట్లు సమాచారం. లంచం డిమాండ్ వెనుక మరెవరైనా రెగ్యులర్ అధికారులు ఉన్నారా అనే అంశంపైనా దర్యాప్తు కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. ట్రాప్‌లో పట్టుబడిన ఇద్దరు ఉద్యోగులను నాంపల్లిలోని ఏసీబీ కార్యాలయానికి తరలించి విచారిస్తున్నట్లు సమాచారం. లంచం డిమాండ్‌కు సంబంధించిన పూర్తి వివరాలు, డబ్బుల లావాదేవీలు, సీఎంఆర్ఎఫ్ ఫైల్ ప్రాసెసింగ్‌లో వారి పాత్ర వంటి అంశాలపై అధికారులు ఆరా తీస్తున్నట్లు తెలుస్తోంది. రాష్ట్ర ప్రభుత్వానికి అత్యంత కీలకమైన కార్యాలయమైన సచివాలయంలోనే సీఎంఆర్ఎఫ్‌కు సంబంధించిన వ్యవహారంలో లంచం తీసుకుంటూ ఉద్యోగులు పట్టుబడినట్లు వార్తలు రావడం ఉద్యోగ వర్గాల్లో చర్చకు దారితీసింది. పేదలు, అనారోగ్యంతో బాధపడుతున్నవారికి ఆర్థిక సాయం అందించేందుకు ఉద్దేశించిన ముఖ్యమంత్రి సహాయ నిధికి సంబంధించిన ప్రక్రియలో లంచం డిమాండ్ చేశారన్న ఆరోపణలు రావడం మరింత ప్రాధాన్యత సంతరించుకుంది.

# నేడు ముదిరాజ్ 'ఛలో అసెంబ్లీ' మహా ధర్నా

**- కాంగ్రెస్ సర్కార్‌పై ధర్మయుద్ధానికి సై**

**- పిలుపునిచ్చిన ముదిరాజ్ చైతన్య వేదిక డాక్టర్ వై.శివ ముదిరాజ్**

**- న్యాయమైన డిమాండ్ల సాధనకై అసెంబ్లీ ముట్టడి**



**హైదరాబాద్ ( ప్రశ్నన్యూస్)** తెలంగాణ రాష్ట్రంలో అత్యంత కీలకమైన బలమైన అత్యంత జనాభా కలిగిన సామాజిక వర్గమైన ముదిరాజుల ఓట్లతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం, అధికారంలోకి వచ్చాక తమకు ఇచ్చిన హామీలను పూర్తిగా పక్కనబెట్టిందని ముదిరాజ్ చైతన్య వేదిక తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ముదిరాజ్ సమాజానికి జరగబోయే అన్యాయాన్ని ఎదిరిస్తూ, తమ సామాజిక న్యాయం, హక్కుల సాధన కోసం నేడు ఉదయం 11 గంటలకు "ఛలో అసెంబ్లీ – శాసనసభ ముట్టడి" కార్యక్రమాన్ని తలపెట్టినట్లు వేదిక రాష్ట్ర ప్రతినిధి డాక్టర్ వై. శివ ముదిరాజ్ అధికారికంగా ప్రకటించారు.

సింహగర్జన చేయనున్న ప్రధాన డిమాండ్లు:

**- బీసీ-ఏ వర్గీకరణ తక్షణ అమలు :**

ముదిరాజుల చిరకాల డిమాండ్ అయిన బీసీ–ఏ కేటగిరీ గుర్తింపును తక్షణమే జీవో రూపంలో తీసుకువచ్చి, విద్యా, ఉద్యోగాల్లో న్యాయమైన రిజర్వేషన్లు కల్పించాలి.

**- కార్పొరేషన్‌కు రూ. 1,000 కోట్ల బడ్జెట్ :**

ముదిరాజ్ ఆర్థిక వికాస కార్పొరేషన్‌కు కేవలం ప్రకటనలకే పరిమితం చేయకుండా, తక్షణమే రూ. 1,000 కోట్ల నిధులు కేటాయించి వెనుకబడిన కుటుంబాలను ఆదుకోవాలి.

**- మత్స్య రంగంలో అక్రమాలపై ఉక్కుపాదం :**

ఉచిత చేప పిల్లల పంపిణీలో జరుగుతున్న భారీ అవినీతి, దళారీల దోపిడీని అరికట్టాలి. నిజమైన ముదిరాజ్ మత్స్యకారులకే నేరుగా లబ్ధి చేకూర్చాలి.

**- రాజకీయ ప్రాతినిధ్యం - నామినేటెడ్ పదవులు :**

రాష్ట్ర జనాభాలో సింహభాగం ఉన్న ముదిరాజులకు ప్రభుత్వ నామినేటెడ్ పదవుల్లో మరియు రాజకీయ పార్టీ కమిటీల్లో జనాభా నిష్పత్తి ప్రకారం సముచిత స్థానం కల్పించాలి.

**- 'ఓట్లు మావి.. సీట్లు మీవా - ఇక సాగవు ఈ మోసాలు ! :**

ఈ సందర్భంగా డాక్టర్ శివ ముదిరాజ్ మాట్లాడుతూ.. దశాబ్దాలుగా ముదిరాజులను కేవలం ఓటు బ్యాంకు రాజకీయాలకే పరిమితం చేశారని మండిపడ్డారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేళ్లవుతున్నా తమ జాతికి ఆశించిన స్థాయిలో రాజ్యాధికారంలో భాగస్వామ్యం దక్కలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇచ్చిన హామీలను అమలు చేసేవరకు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీస్తామని, తమ ఆత్మగౌరవ పోరాటం ప్రజాస్వామ్య పద్ధతిలో అసెంబ్లీ సాక్షిగా కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు.

**- సమాజానికి బహిరంగ విజ్ఞప్తి:**

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ముదిరాజ్ చైతన్య వంతమైన యువత, విద్యార్థులు, మత్స్యకార సొసైటీల ప్రతినిధులు మరియు కుల బంధువులంతా రేపు ఉదయం 11 గంటలకు హైదరాబాద్‌లోని అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి భారీ సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

**- ముట్టడి వేదిక వివరాలు :**

తేదీ : 11-09-2026 ( నేడు, శుక్రవారం)
సమయం: ఉదయం 11:00 గంటలకు
స్థలం : తెలంగాణ శాసనసభ (అసెంబ్లీ), హైదరాబాద్.
ముదిరాజ్ చైతన్య వేదిక : 9963240529

## కిష్టాపూర్‌లో అక్రమ మట్టి మాఫియాపై

# పోలీసుల దాడి

**- 7 భారీ టిప్పర్లు సీజ్.. రెవెన్యూ అధికారులకు అప్పగింత**



**మేడ్చల్ (ప్రశ్న న్యూస్)** మేడ్చల్ పరిధిలోని కిష్టాపూర్ ప్రాంతంలో అక్రమంగా మట్టి తరలిస్తున్న మట్టి మాఫియాపై పోలీసులు కొరడా ఝుళిపించారు. కాసా గ్రాండ్ సమీపంలో అనుమతులు లేకుండా మట్టి తరలిస్తున్న 7 భారీ టిప్పర్లను మేడ్చల్ పోలీసులు పట్టుకుని సీజ్ చేశారు.వాహనాల్లో మట్టి తరలింపునకు సంబంధించి అవసరమైన అనుమతులు, రవాణా బిల్లులు, ఇతర పత్రాలు లేకపోవడంతో పోలీసులు వాహనాలను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వాటిని రెవెన్యూ అధికారులకు అప్పగించినట్లు సమాచారం.

**అనుమతులు లేకుండా మట్టి తరలింపు**

కిష్టాపూర్ పరిసర ప్రాంతాల్లో కొంతకాలంగా అక్రమ మట్టి తవ్వకాలు, అనుమతులు లేకుండా మట్టి తరలింపు జరుగుతోందన్న ఆరోపణలు వినిపిస్తున్న నేపథ్యంలో పోలీసుల చర్య ప్రాధాన్యత సంతరించుకుంది. రాత్రి వేళల్లోనూ భారీ వాహనాలతో మట్టి తరలిస్తున్నారన్న ఆరోపణలపై అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు.

**నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు**

అక్రమంగా మట్టి తవ్వకాలు, తరలింపులకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని మేడ్చల్ తహశీల్దార్ భూపాల్ హెచ్చరించారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా మట్టి తవ్వకాలు చేపట్టడం, అనుమతులు లేకుండా తరలించడం చట్టపరంగా నేరమని తెలిపారు.

**అధికారుల నిఘా కొనసాగాలి**

ఒకసారి వాహనాలను పట్టుకోవడంతోనే అక్రమ మట్టి తరలింపు పూర్తిగా అరికట్టబడదని, కిష్టాపూర్‌తో పాటు మేడ్చల్ పరిధిలోని ఇతర ప్రాంతాల్లోనూ అధికారులు నిరంతర నిఘా పెట్టాలని స్థానికులు కోరుతున్నారు. అక్రమ తవ్వకాల వెనుక ఉన్న వ్యక్తులు, వాహనాల యజమానులు, నిర్వాహకులపై కూడా పూర్తి స్థాయిలో విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

# గజ్వేల్ జిల్లా ఆస్పత్రిలో క్లిష్టమైన శస్త్రచికిత్స విజయవంతం

**- ఆరోగ్యశ్రీ ద్వారా నిరుపేద మహిళకు ఉచితంగా చికిత్స**

**- వైద్య బృందాన్ని అభినందించిన ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజశేఖర్**






**గజ్వేల్ ( ప్రశ్న న్యూస్)** గజ్వేల్ ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో వైద్యులు క్లిష్టమైన శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించారు. దీర్ఘకాలంగా తీవ్రమైన అనారోగ్యంతో బాధపడుతున్న నిరుపేద మహిళకు ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఉచితంగా శస్త్రచికిత్స చేసి ఉపశమనం కల్పించారు.సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం జాలిగామ గ్రామానికి చెందిన జి. యాదమ్మ (46) గత రెండేళ్లుగా తీవ్రమైన రక్తస్రావం, కడుపుబ్బరం, కడుపునొప్పి, తీవ్ర రక్తహీనతతో బాధపడుతున్నారు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకునే స్థోమత లేక ఆమె గజ్వేల్ జిల్లా ఆస్పత్రిని ఆశ్రయించారు.రోగి పరిస్థితిని పరిశీలించిన ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజశేఖర్ తక్షణమే స్పందించి ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించడంతో పాటు ముందస్తుగా రక్తమార్పిడి, అత్యవసర మందులు అందించి శస్త్రచికిత్సకు ఏర్పాట్లు చేశారు.జనరల్ సర్జన్ డాక్టర్ ప్రవీణ్ కుమార్ నేతృత్వంలో, అనస్థీషియా వైద్యుడు డాక్టర్ మైపాల్ సహకారంతో క్లిష్టమైన శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించారు. ప్రస్తుతం యాదమ్మ ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు.ఈ సందర్భంగా డాక్టర్ రాజశేఖర్ మాట్లాడుతూ.. నిరుపేద ప్రజలకు అత్యాధునిక వైద్య సేవలు ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ఉచితంగా అందుబాటులో ఉన్నాయని తెలిపారు. గజ్వేల్ జిల్లా ఆస్పత్రిలో ఇటువంటి క్లిష్టమైన శస్త్రచికిత్సలు కూడా విజయవంతంగా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ప్రజలు ప్రభుత్వ ఆస్పత్రిలో అందుతున్న వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.క్లిష్టమైన శస్త్రచికిత్సను విజయవంతంగా పూర్తి చేసిన వైద్యులు, నర్సింగ్, సాంకేతిక, పేషెంట్ కేర్, ఆరోగ్యశ్రీ సిబ్బందిని ఆస్పత్రి పాలకవర్గం ప్రత్యేకంగా అభినందించింది. రోగి బంధువులు వైద్య బృందానికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజశేఖర్, ఆర్ఎంవోలు డాక్టర్ రాము, డాక్టర్ శ్రీధర్, జనరల్ సర్జన్ డాక్టర్ ప్రవీణ్ కుమార్, అనస్థీషియా వైద్యుడు డాక్టర్ మైపాల్, హెడ్ నర్స్ రాంబాయమ్మ, నర్సింగ్ ఆఫీసర్ యాదమ్మ, ఓటీ టెక్నీషియన్లు రాజు, వెంకట్, పేషెంట్ కేర్ సిబ్బందిరాజు, సంతోష, ఆరోగ్యశ్రీసిబ్బందిసురేందర్, సంతోష్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

# విచ్చలవిడిగా అక్రమ నీటి దందా

## – అడుగంటుతున్న భూగర్భజలాలు

- హద్దు అదుపులేని ప్రైవేట్ నీటి ట్యాంకర్ల ఆగడాలు
-ఎల్ నినో ప్రభావం వల్ల అడుగంటి పోతున్న భూగర్భజలాలు
- కాసులు కురిపిస్తున్న అక్రమ నీటి వ్యాపారం
-అధికారుల కనుసన్నల్లో అక్రమ దందా -సమాజ సేవ పేరుతో నీటి మాఫియా
- భారీగా నీటి దందాకు పాల్పడుతున్న ?ప్రైవేటు ట్యాంకర్ల యజమానులు
-చెరువులు, కుంటలు ఎఫ్.టి.ఎల్ లో అక్రమ బోర్లు వేసి భూగర్భజలాల దోపిడీకి పాల్పడుతున్న దళారులు
-ప్రభుత్వ స్థలాలు, అసైన్డ్ భూముల్లో యదేచ్ఛగా బోర్లు వేసి అక్రమ నీటి దందా
- నిద్రమత్తులో తూగుతున్న రెవిన్యూ, జిహెచ్ఎంసీ అధికారులు

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ఎల్ నినో ప్రభావం వల్ల వాతావరణంలో సంభవిస్తున్న పెను మార్పుల కారణంగా వర్షాభావ పరిస్థితులు నెలకొన్నా తరుణంలో తీవ్ర నీటి ఎద్దడి ఏర్పడే ప్రమాదం పొంచి ఉంది. ప్రజల దాహార్తిని తీర్చేందుకు సైతం నీటి కొరత ఏర్పడే పరిస్థితితులు దాపురించాయి. ఫలితంగా కొందరు దళారులు నీటి అవసరాలను ఆసరాగా చేసుకుని, వ్యాపారమయంగా మార్చి దోచుకుంటున్నారు. ఒక్కో పాయింట్ ద్వారా రోజుకు 10 నుండి 50 ట్యాంకర్ల వరకు అక్రమంగా నీటిని తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఈ తతంగమంతా ఏ మారుమూల ప్రాంతంలో జరుగుతున్న వ్యవహారం కాదు. హైదరాబాద్ మహానగరం పాలక మండలి నడిబొడ్డులో ప్రజల అవసరాలను ఆసరాగా చేసుకుని సాగిస్తున్న అక్రమ నీటి భాగోతం.



శంషాబాద్ చెరువు వద్ద బోర్ నీరు నింపుకుంటున్న ప్రైవేట్ ట్యాంకర్

### కాసులు కురిపిస్తున్న నీటి వ్యాపారం

జిహెచ్ఎంసీ యంత్రాంగం ఆధ్వర్యంలో నగరంలోని పలు కాలనీల్లో ట్యాంకర్ల ద్వార నీటిని సరఫరా చేస్తున్నను, అక్రమ ప్రైవేటు ట్యాంకర్ల వ్యవహారం ఇష్టారాజ్యంగా మారింది. డ్రైవర్లే కీలక సూత్రధారులుగా అక్రమ నీటి వ్యాపారానికి తెరలేపారు. ముందు కుదుర్చుకున్న ఒప్పందాల ప్రకారం హోటళ్లు, రెస్టారెంట్లు, ప్రైవేటు ఆస్పత్రులు, ఇతర సంస్థలకు అక్రమంగా నీటిని సరఫరా చేస్తూ తమ వ్యాపారాన్ని బహిరంగంగానే కొనసాగిస్తున్నారు. దీనిపై ఎవరైనా ప్రశ్నిస్తే తాము సమాజ సేవ చేస్తున్నామని, నీటి అవసరాల దృష్ట్యా డబ్బులు తీసుకోవడం లేదని బుకాయిస్తున్నారు. అయితే వాస్తవ పరిస్థితిని చూస్తే ఎల్ నినో ప్రభావం వల్ల భూగర్భజలాలు అడుగంటి పోతున్న నేపథ్యంలో అక్రమ నీటి వ్యాపారం సాగుతున్నను అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు ఈ విషయం కార్పోరేషన్ ఇంజనీర్ల దృష్టికి వెళ్లినను కనీసం చర్యలు తీసుకోకపోవడం వెనుక ఉన్న ఆంతర్యం సంబంధిత అధికారులకే తెలియాల్సి ఉంది. అక్రమంగా చేస్తున్న నీటి వ్యాపారాన్ని అడ్డుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


### ధరలు పెంచేసిన ట్యాంకర్ల యజమానులు

క్రమేపి నీటికి డిమాండ్ పెరగడంతో ట్యాంకర్ల యజమానులు ఇదే అదనుగా ధరలు పెంచుతున్నారు. దీంతో ఒక ట్యాంకర్ నీటిని రూ 1000 నుండి 5000 వేల వరకు విక్రయిస్తున్నారు. అయితే తప్పని పరిస్థితుల్లో ప్రజలు ట్యాంకర్ యజమానులు చెప్పిన ధరను చెల్లించి కొనుగోలు చేస్తున్నారు. ముందుగా ఏర్పాటు చేసుకున్న నీటి నిల్వ గుంతలో బోరు ద్వారా నీటిని తోడి నిల్వ చేసి అక్రమంగా తరలిస్తున్నారు. రసాయన, ఇతర పరిశ్రమల అవసరాలకు భారీగా నీటిని విక్రయిస్తున్నారు. అలాగే నగర చుట్టుపక్కల ప్రాంతాల్లోని చెరువుల శిఖాలు, ఎఫ్టీఎల్, బఫర్ జోన్లలో వేలాది బోర్లతో నీటిని తోడుతు అక్రమ వ్యాపారం నిర్వహిస్తున్నారు. నగర శివారులోని చెరువుల్లో భారీగా అక్రమ నీటి దందా జోరుగా సాగుతోంది. పెద్ద ఎత్తున బోర్లు వేసి, జలవనరులను దోపిడీ చేస్తున్నారు. హైదరాబాద్ మహానగర పాలక సంస్థతోపాటు శివారు ప్రాంతాల్లో మంచినీటి అవసరాలను కొందరు అక్రమ వ్యాపారంగా మరల్చుకొని వ్యాపారం అక్రమ వ్యాపారంతో కోట్లకు పడగలేత్తుతున్నారు. నగరం చుట్టు ఉన్న నీటి వనరులు, మురుగు, రసాయన వ్యర్థాలతో దాదాపు కలుషితమై వినియోగానికి పనికి రాని చెరువులు, కుంటల్లో బోర్లు వేసి, భూగర్భజలాలను తోడేస్తున్నారు. ఈ నీటిని పరిశ్రమలు, కాలనీల్లో నీటి వినియోగానికి తరలిస్తున్నారు. స్థానిక రాజకీయ నాయకులు, పలుకుబడి ఉన్న వారు ట్యాంకర్లను ఏర్పాటు చేసుకుని ఇలా నీటి వ్యాపారం చేస్తుండడం గమనార్హం. నిత్యం వేల కొద్దీ ట్యాంకర్లు ఈ అక్రమ వ్యాపారంలో పరుగులు పెడుతున్నారు. చెరువులు, కుంటల శిఖాల ఎఫ్టీఎల్, బఫర్ జోన్లు, మత్తడి ప్రాంతాలను కబ్జా చేసి ఆ ప్రాంతాల్లో భారీ గుంతలు తవ్వి, నీరు ఇంకిపోకుండా టార్పాలిన్లతో కప్పేస్తు అదే ప్రాంత సమీపంలో 8, 12 ఇంచుల బోర్లు వేసి నీటిని తోడి గుంతల్లో నిల్వ చేసి అక్రమంగా అమ్ముతున్నారు. ఒక్కో బోరు, మోటారు, జనరేటర్, నీటి గుంత నిర్మాణం, టార్పాలిన్‌కు లక్షల్లో ఖర్చు చేస్తున్నారు. బోర్లకు కొన్ని ప్రాంతాల్లో అక్రమంగా విద్యుత్ తీగలు కూడా అమర్చి విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్నారని సమాచారం. జోరుగా సాగుతున్న నీటి అక్రమ వ్యాపారంలో కొందరు బ్రోకర్లు బోర్లు తవ్వి నీటిని ఎత్తిపోయడం వరకు పరిమితమవగా, రవాణా, విక్రయాలను ట్యాంకర్ల యజమానులు చూసుకుంటున్నారు. కొన్నిచోట్ల బోరు, ట్యాంకర్లను ఒకే వ్యక్తి నిర్వహిస్తుండడం గమనార్హం. చెరువులు, కుంటలే కాకుండా ఎసైన్డ్ భూములు, ప్రభుత్వ, అటవీ భూముల్లోను బోర్లు వేసి నీటిని తరలిస్తున్నారు. కాలుష్యం వల్ల సాగు మానుకున్న భూముల యజమానులు ఆదాయం కోసం తమ పొలాల్లోని బోర్లను అద్దెకు ఇస్తున్నారు.

ట్యాంకర్‌కు సుమారుగా రూ.1000 వరకు తీసుకుంటుండగా, హైదరాబాద్‌లోని కాలనీలకు వెళ్లే మార్గాలు, పారిశ్రామిక వాడలున్న ప్రాంతాల్లో చెరువుల కింద ఈ వ్యాపారం జోరుగా సాగుతోంది. నీటి వనరులపై అక్రమ నీటి దందా విచ్చలవిడిగా జరుగుతుండడంతో రాబోయే కాలంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యే పరిస్థితులు నెలకొన్న ప్రమాదం పొంచి ఉంది. ఇక అక్రమ నీటి వ్యాపారంలో ట్యాంకర్లకు అనుమతులు ఉండవు. కావున వాటి నంబర్ ప్లేట్లు కూడా అస్పష్టంగా ఉండేలా జాగ్రత్త పడుచున్నారని సమాచారం. ఏదిఏమైనా ఎల్ నినో ప్రభావం వల్ల ముందు ముందు ఎదురయ్యే నీటి ఎద్దడిని దృష్టిలో పెట్టుకొని, అక్రమ మార్గాల ద్వారా భూగర్భజలాలను తోడేస్తున్న అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు సంబంధిత అధికారులను కోరుతున్నారు.

# సంగీత దర్శకుడు ఇళయరాజాకు ఢిల్లీ హైకోర్టు నోటీసులు

- కోర్టు ఉత్తర్వులను ఉల్లంఘిస్తున్నారంటూ సరిగమ సంస్థ పిటిషన్



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) ప్రముఖ సంగీత దర్శకుడు ఇళయరాజాకు ఢిల్లీ హైకోర్టు గురువారం నోటీసులు జారీ చేసింది. న్యాయస్థానం గతంలో జారీ చేసిన ఉత్తర్వులను ఆయన ఉల్లంఘిస్తున్నారంటూ ప్రముఖ మ్యూజిక్ సంస్థ ‘సరిగమ’ దాఖలు చేసిన కోర్టు ధిక్కరణ పిటిషన్‌పై వివరణ ఇవ్వాలని ధర్మాసనం ఈ సందర్భంగా ఆదేశించింది. సరిగమ సంస్థ తాజాగా దాఖలు చేసిన ఈ పిటిషన్‌లో ఇళయరాజాపై తీవ్రమైన ఆరోపణలు చేసింది. తాము కాపీరైట్లు హక్కులు కలిగి ఉన్న పాటలను ఆయన వాణిజ్య ప్రయోజనాల కోసం వినియోగిస్తున్నారని, తద్వారా గతంలో కోర్టు ఇచ్చిన స్టే ఉత్తర్వులను ఉద్దేశపూర్వకంగా అతిక్రమిస్తున్నారని పేర్కొంది. ఈ మేరకు ఇళయరాజాపై కోర్టు ధిక్కరణ చర్యలు చేపట్టాలని విన్నవించింది. అంతేకాకుండా, ఆయన ఆస్తులను జప్తు చేసి, వాటి విక్రయం ద్వారా వచ్చిన సొమ్మును తమకు చెల్లించాలని కూడా పిటిషన్‌లో కోరింది.గతంలో ఇళయరాజా స్వరపరిచిన పలు చిత్రాల పాటలకు సంబంధించిన కాపీరైటు హక్కులు తమకే దక్కుతాయని, అయినప్పటికీ ఆయన ఆ హక్కులను క్లెయిమ్ చేస్తూ వాణిజ్యపరంగా వాడుకుంటున్నారని సరిగమ సంస్థ న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. అప్పట్లో ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన ధర్మాసనం, ఈ వ్యవహారంపై స్టే విధిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. అయితే, ఆ స్టే ఉత్తర్వులను ఇళయరాజా బేఖాతరు చేస్తున్నారని సరిగమ తాజాగా ఆరోపించింది. ఈ పిటిషన్‌ను విచారణకు స్వీకరించిన ఢిల్లీ హైకోర్టు, ఈ ఫిర్యాదుపై స్పందించాలని ఆదేశిస్తూ ఇళయరాజాకు నోటీసులు జారీ చేస్తూ తదుపరి విచారణను వాయిదా వేసింది.

# నియోజకవర్గ నిధుల కోసమే సీఎంను కలిశా

- కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి క్లారిటీ



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో తన భేటీపై సాగుతున్న ప్రచారానికి మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తెరదించారు. ముఖ్యమంత్రి, తాను ఎప్పుడూ కలహించుకోవాలని కొందరు కోరుకుంటున్నారని ఆయన ఆరోపించారు. నియోజకవర్గ అభివృద్ధికి, నిధుల మంజూరు కోసం ముఖ్యమంత్రిని, ఉప ముఖ్యమంత్రిని కలవడంలో తప్పేముందని ఆయన ప్రశ్నించారు. అభివృద్ధి పనుల నిమిత్తం వారిని కలవడం అనివార్యమని, దీనికి రాజకీయ అర్థాలు ఆపాదించవద్దని కోరారు. ముఖ్యమంత్రితో తనకు అభిప్రాయ భేదాలు ఉన్న మాట వాస్తవమేనని, అయితే అవి సహజమైనవని రాజగోపాల్ రెడ్డి స్పష్టం చేశారు. మంత్రి పదవి కోసం తాను ముఖ్యమంత్రికి లొంగిపోయినట్లు కొందరు, ఇద్దరి మధ్య విభేదాలు తారాస్థాయికి చేరాయని మరికొందరు చేస్తున్న ప్రచారాన్ని ఆయన ఖండించారు. “ముఖ్యమంత్రిని కలిస్తే లొంగిపోయినట్లు, కలవకపోతే దూరం పెరిగినట్లు రకరకాలుగా ప్రచారం చేస్తున్నారు. నేను, సీఎం ఘర్షణ పడాలని కొందరు ఆశిస్తున్నారు” అని ఆయన వ్యాఖ్యానించారు.

మంత్రి పదవుల విస్తరణ అంశం పూర్తిగా పార్టీ అధిష్ఠానం పరిధిలోనిదని, గతంలో తనకు మంత్రి పదవి ఇస్తామని హామీ లభించినట్లు రాజగోపాల్ రెడ్డి గుర్తు చేశారు. అధిష్ఠానం తీసుకునే ఏ నిర్ణయానికైనా తాను కట్టుబడి ఉంటానని స్పష్టం చేశారు. కొండా సురేఖ విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యవహరించిన తీరులో ఎలాంటి తప్పు లేదని, ఆయన అధిష్ఠానానికి సరైన సమాచారాన్నే అందించారని అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో భిన్నమైన అభిప్రాయాలు ఉండటం సహజమని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ప్రభుత్వం అందిస్తున్న రూ. 5 లక్షల ఆర్థిక సాయం స్వల్ప మొత్తమేమీ కాదని ఆయన ఈ సందర్భంగా వెల్లడించారు.

# సీజ్ చేసి.. మళ్లీ ఓపెన్ ఎందుకు.?

## అరుణ గోదాంపై మున్సిపల్ అధికారుల చర్యలపై ప్రజల్లో అనేక సందేహాలు

మేడ్చల్ (ప్రశ్న న్యూస్) ఎల్లంపేట మున్సిపాలిటీ పరిధిలోని అరుణ గోదాం వ్యవహారం మరోసారి చర్చనీయాంశంగా మారింది. అనుమతులు, నిర్మాణ నిబంధనలపై గతంలోనే అభ్యంతరాలు వ్యక్తమవుతున్న ఈ గోదాంపై అధికారులు చర్యలు తీసుకున్నప్పటికీ.. కొద్దిరోజులకే మళ్లీ కార్యకలాపాలు కొనసాగుతుండటంపై స్థానికులు ప్రశ్నలు సంధిస్తున్నారు.

మున్సిపాలిటీకి కొత్తగా కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన కృష్ణారెడ్డి అరుణ గోదాంను సీజ్ చేయాలని ఆదేశాలు జారీ చేసి చర్యలు తీసుకున్నట్లు సమాచారం. అయితే సీజ్ చేసిన విషయం జరిగి పది రోజులు కూడా పూర్తికాకముందే గోదాం పనులు మళ్లీ యథావిధిగా కొనసాగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.

### సీజ్ ఎందుకు.?.. ఓపెన్ ఎందుకు.?

ఒకవైపు నిబంధనలు పాటించలేదని గోదాంను సీజ్ చేస్తారు. మరోవైపు అదే గోదాం కొద్దిరోజులకే ఎలా తెరుచుకుంటుందన్నదే ఇప్పుడు ప్రధాన ప్రశ్నగా మారింది. సీజ్ చేసిన తర్వాత యాజమాన్యం ఏమైనా అనుమతులు పొందిందా.? అధికారులు మళ్లీ కార్యకలాపాలకు అనుమతి ఇచ్చారా? లేక సీజ్ ఉత్తర్వులు అమలు కాకుండానే పనులు కొనసాగుతున్నాయా.? అనే ప్రశ్నలు స్థానికుల నుంచి వినిపిస్తున్నాయి.గతంలోనూ అరుణ గోదాం నిర్మాణంపై అనుమతులు, నిబంధనల ఉల్లంఘనకు సంబంధించి వార్తలు వెలువడ్డాయి.

### అధికారుల మధ్య సమన్వయం లేదా.?

ఒక కమిషనర్ వచ్చి సీజ్ చేయించడం.. కొద్దిరోజులకే అదే గోదాం మళ్లీ కార్యకలాపాలు ప్రారంభించడం వెనుక అసలు కారణమేంటో అధికారులు ప్రజలకు స్పష్టం చేయాల్సిన అవసరం ఉంది.

సీజ్ ఉత్తర్వులు జారీ చేశారా.?
అమలు చేసిన తేదీ ఏది.?
ప్రస్తుతం గోదాం తెరవడానికి అనుమతి ఎవరు ఇచ్చారు.?
అనుమతులు ఉంటే వాటి వివరాలు ఏమిటి.?
అనుమతులు లేకపోతే మళ్లీ పనులు ఎలా కొనసాగుతున్నాయి.?
అనే అంశాలపై ఎల్లంపేట మున్సిపల్ అధికారులు స్పష్టమైన వివరణ ఇవ్వాలని స్థానికులు కోరుతున్నారు.



### ఉన్నతాధికారులు దృష్టి సారించాలి

అరుణ గోదాం వ్యవహారంపై మున్సిపల్ అధికారులు పూర్తిస్థాయి రికార్డులను పరిశీలించి వాస్తవాలను ప్రజలకు వెల్లడించాలని స్థానికులు కోరుతున్నారు. ఒకసారి సీజ్ చేసిన నిర్మాణం మళ్లీ తెరుచుకున్నట్లయితే దానికి సంబంధించిన అనుమతులు, ఉత్తర్వులు, నిబంధనల అమలు తదితర అంశాలపై పారదర్శకంగా విచారణ జరపాలని డిమాండ్ చేస్తున్నారు. “సీజ్ చేయడం.. మళ్లీ ఓపెన్ చేయడం.. ఇదేనా మున్సిపల్ పాలన?” అనే ప్రశ్న ప్రస్తుతం ఎల్లంపేట ప్రజల్లో చర్చనీయాంశంగా మారింది.

# తిరుమల శ్రీవారికి రికార్డు స్థాయిలో ఆదాయం

- ఒక్కరోజే రూ.6.93 కోట్లు



తిరుమల (ప్రశ్న న్యూస్) కలియుగ దైవం తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయానికి భక్తులు సమర్పించే కానుకల ప్రవాహం కొనసాగుతోంది. తాజాగా, శ్రీవారి హుండీ ఆదాయం మరోసారి రికార్డు స్థాయికి చేరింది. గురువారం ఒక్కరోజే రూ. 6.93 కోట్ల ఆదాయం లభించినట్లు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అధికారులు వెల్లడించారు. ఇది ఇటీవలి కాలంలో నమోదైన అత్యధిక ఒక్కరోజు ఆదాయాలలో ఒకటి కావడం విశేషం.గతంలో కేవలం మూడు సార్లు మాత్రమే హుండీ ఆదాయం రూ. 6 కోట్ల మార్కును దాటిందని, ఇప్పుడు ఇది నాలుగోసారి అని అధికారులు పేర్కొన్నారు. తిరుమల చరిత్రలో ఇప్పటివరకు నమోదైన అత్యధిక ఒక్కరోజు హుండీ ఆదాయం 2023 జనవరి 2న వైకుంఠ ఏకాదశి పర్వదినాన వచ్చిన రూ. 7.68 కోట్లు. ఆ తర్వాత ఇదే అత్యధిక మొత్తం కావడం గమనార్హం. గతంలో 2022 అక్టోబర్‌లో రూ. 6.31 కోట్లు, 2018 జూలైలో రూ. 6.28 కోట్ల చొప్పున ఆదాయం సమకూరింది. ఇటీవల 2026 ఆగస్టు నెలలో కూడా ఒకేరోజు రూ. 6.1 కోట్ల ఆదాయం వచ్చింది. వార్షికంగా చూస్తే, శ్రీవారి ఆదాయం గణనీయంగా పెరుగుతోంది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో శ్రీవారి హుండీ ద్వారా సుమారు రూ. 1,738 కోట్ల ఆదాయం నమోదైంది. సాధారణ రోజుల్లో శ్రీవారి హుండీకి సగటున రూ. 3 నుంచి 5 కోట్ల వరకు ఆదాయం వస్తుంటుంది. ప్రపంచంలోనే అత్యంత సంపన్న హిందూ దేవాలయాల్లో ఒకటిగా పేరుగాంచిన తిరుమల క్షేత్రానికి భక్తులు నగదు, బంగారం, వెండి, విదేశీ కరెన్సీ రూపంలో భారీగా కానుకలు సమర్పిస్తుంటారు. ఈ నిధులను టీటీడీ ఆలయ నిర్వహణ, అభివృద్ధి, అన్నప్రసాద వితరణ, ఇతర ధార్మిక సేవా కార్యక్రమాలకు వినియోగిస్తుంది.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.no : 12-13-1282, Flat No : 407, Mehtab Arcade, Tarnaka Main Road, Opp.Ganesh Temple, Secunderabad - 500017, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588